




నగర సేద్యం

మడక దున్నుతున్నారు.. మాను తోలుతున్నారు.. అడుసు తొక్కుతున్నారు.. నారు పెరుకుతున్నారు.. నాట్లు వేస్తున్నారు.. ఎండకి చెట్టునీడకి చేరి సేదదీరుతున్నారు.. నడివేసవిలో సాగుతున్న ఈ వరిసేద్యం దృశ్యాలు నీటి వనరులకు లోటులేని ఏ మారుమూల పల్లెల్లోనివో కాదు. లక్షల జనంతో కిక్కిరిసిన తిరుపతి నగరంలోనివి. కాంక్రీట్‌జనారణ్యంలో ఆదివారం మిట్టమధ్యాహ్నపు వేళ 'ఆంధ్రజ్యోతి' కంటబడ్డ శ్రమసౌందర్యం ఇది. అభయమిస్తున్నట్టుగా తిరుమల కొండ.. కొండతో పోటీ పడుతున్నట్టుగా ఆకాశహర్మ్యాలు.. సందడితో నిండిన రెస్టారెంట్లు, రహదారిపై దూసుకుపోయే వాహనాల రణగొణ శబ్దాలు.. వాటి నడుమనే తిమ్మినాయుడుపాళెం మాస్టర్‌ప్లాన్ రోడ్డుకు ఆనుకుని ఇలా వ్యవసాయం సాగుతోంది. విస్తరించుకుని వస్తున్న రియల్‌ఎస్టేట్ వెంచర్ల మధ్యనే ముత్తు, చిరంజీవి, రమణ, మునికృష్ణ అనే నలుగురు రైతులు ఖాళీగా ఉన్న భూమిని కౌలుకు తీసుకుని పంటలు పండిస్తున్నారు. ఎకరా కోట్లు పలికే నేలలో వేల రూపాయలైనా గిట్టుబాటు కాని కష్టం ఎందుకు అని ఈ రైతులు అనుకోలేదు. రోజూ 'మడికాడికి నడిచి, పచ్చని గాలి పీలిస్తే ఉండే ఆనందం వేరే' అంటున్నారు ఈ కర్షకులు. 'రెండు కార్లు పండుతున్నాయి. ఇంటికి కావలసిన గింజలు వస్తున్నాయి. ఇంతకన్నా కావాల్సింది ఏమి?' అని సంతృప్తిని ప్రకటిస్తున్నారు వీరు. పచ్చని పైరు తన హృదయంపై పరచుకుంటేనే నేలతల్లికి శాంతి. కాయకష్టంతో చెమట కారితేనే రైతుకీ మనశ్శాంతి.

- తిరుపతి అర్బన్, ఆంధ్రజ్యోతి

చెట్టు తొర్రలో సారా



- చెంబుల్లో దాచిన అక్రమార్కులు
- పసిగట్టిన డ్రోన్



ఎర్రావారిపాలెం మండలంలో చెట్టు తొర్రలో దాచి ఉంచిన సారాను బయటకు తీస్తున్న పోలీసులు

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో డ్రోన్ల నిఘా పెరిగింది. తాజాగా చెట్టు తొర్రలో దాచి ఉంచిన సారా గుట్టును డ్రోన్ రట్టు చేసింది. ఎర్రావారిపాలెం, భాకరాపేట, తలకోన, వేములవాడ, గ్రామాల పరిధిలో ఇటీవల నాటుసారా తయారీ ఎక్కువగా ఉంది. నాటుసారాను తయారుచేసి వివిధ ప్రాంతాల్లో దాచి.. రాత్రికి రాత్రే ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. పోలీసులు ఎన్నిసార్లు తనిఖీలు చేపట్టినా ఇలా దాచి ఉంచిన సారాను పట్టుకోలేని పరిస్థితి. చెట్లు చాటున సారా తయారు చేసి.. చెట్టు తొర్రల్లో దాచిన ముఠాను గుర్తించడం పోలీసులకు పెద్ద సవాల్‌గా మారింది. భాకరాపేట సీఐ ఇమ్రాన్‌భాషా ఆధ్వర్యంలో ఎస్‌ఐలు, పోలీసులు డ్రోన్ నిఘా పెట్టారు. ఎర్రావారిపాల్లెం మండలం వేములవాడ గ్రామం, తలకోన వాటర్ కెనాల్, భాకరాపేట,తో పాటు దాదాపు 25 ప్రాంతాల్లో డ్రోన్లు ఎగురవేసి అనుమానం వున్న ప్రతి ప్రాంతాన్ని నిశితంగా తనిఖీ చేశారు. దీనికోసం ప్రత్యేక బృందం సీఐ వినోద్‌కుమార్ డ్రోన్ అందించిన ఫొటోల ఆధారంగా సారా తయారు చేసి దాచి వుంచిన స్థలాలను కనుగొన్నారు. అక్కడకు చేరుకుని చెట్ల తొర్రల్లో దాచి వుంచిన 14 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. ఈ డ్రోన్ సాయంతో వేములవాడ గ్రామానికి చెందిన హనుమంతు, వేణు, మునస్వామిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

ఇక, సత్యవేడు, విజయపురంలో..

డ్రోన్ల సహాయంతో నాటుసారా స్థావరాలపై నిఘా ఉంచిన పోలీసు అధికారులు రెండో విడతలో సత్యవేడు, విజయపురం మండలాల్లో నిఘా ఉంచనున్నారు. రెండు డ్రోన్లు ఉపయోగించి జిల్లా వ్యాప్తంగా నాటుసారా, గంజాయి, మత్తు పదార్థాలు గుర్తించేలా ఎస్పీ హర్షవర్ధనరాజు ప్రత్యేక పోలీసు బృందాలకు దిశా నిర్దేశం చేశారు. ముఖ్యంగా తిరుపతి, చంద్రగిరి ప్రాంతాలపై ఎక్కువగా ఫోకస్ చేయనున్నారు.

నిమిషం లేటైనా అనుమతించరు


ద్వారకనాథ్‌రెడ్డి

- ఎల్లుండే పాలిసెట్
- తిరుపతి, గూడూరు, సత్యవేడుల్లో 15 పరీక్షా కేంద్రాల ఏర్పాటు

తిరుపతి(విద్య), ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): నిమిషం ఆలస్యమైనా పరీక్షకు అనుమతించేది లేదని పాలిసెట్ జిల్లా కోఆర్డినేటర్, ఎస్వీ పాలిటెక్నిక్ ప్రిన్సిపల్ డాక్టర్ వై.ద్వారకనాథరెడ్డి స్పష్టంచేశారు. పాలిటెక్నిక్ కోర్సుల ప్రవేశానికి ఈనెల 30న (బుధవారం) నిర్వహించే పాలిసెట్‌కు సకాలంలో ఆయా కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. ఆయన తెలిపిన ప్రకారం.. జిల్లా వ్యాప్తంగా 5,288 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. వీరిలో తిరుపతిలో 3,771 మందికి 8 కేంద్రాలు, గూడూరులో 1,217 మందికి 5, సత్యవేడులో 300 మందికి రెండు చొప్పున మొత్తం 15 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. 30వ తేదీన ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరిగే పరీక్ష కోసం అభ్యర్థులను ఉదయం 10 గంటల నుంచి కేంద్రాల్లోకి అనుమతిస్తారు. హాల్‌టికెట్, ఏదేని గుర్తింపు కార్డుతోపాటు హెచ్‌బీ పెన్సిల్, బాల్‌పాయింట్ పెన్, ఎరేజర్, షార్ప్‌నర్ తెచ్చుకోవాలి. మొబైల్ ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతిలేదు. ఉదయం 9.30 గంటలకే అభ్యర్థులు ఆయా కేంద్రాలకు చేరుకుంటే ఎలాంటి టెన్షన్ లేకుండా పరీక్ష రాయొచ్చని పాలిసెట్ జిల్లా కోఆర్డినేటర్ వై.ద్వారకనాథరెడ్డి తెలిపారు.

ఇవీ పరీక్షా కేంద్రాలు

తిరుపతి: ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్.. ఎస్వీ డబ్ల్యూ టీటీడీ పాలిటెక్నిక్ (ఎస్వీ డెయిరీ ఫారం సమీపాన).. ఎస్వీ జూనియర్ కళాశాల, వింగ్-ఎ, వింగ్ బి (విద్యాపీఠం సమీపం).. ఎస్వీ బాలికల పాఠశాల (బాలాజీకాలనీ).. ఎస్వీడబ్ల్యూ జూనియర్ కళాశాల, వింగ్-ఎ, వింగ్-బి (పద్మావతి గెస్ట్ హౌస్ వద్ద).. ఎస్‌జీఎస్ హైస్కూల్ (టీటీడీ ఏడీ భవనం సమీపం). **గూడూరు:** డీఆర్‌డబ్ల్యూ కళాశాల.. ఎస్‌కేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల.. ప్రభుత్వ పాలిటెక్నిక్ (తిలక్ నగర్).. బాలికల జడ్పీ హైస్కూల్.. బాలుర జడ్పీ హైస్కూల్.
సత్యవేడు: పీఎస్‌డబ్ల్యూఆర్ బాలికల జూనియర్ కళాశాల.. ప్రభుత్వ పాలిటెక్నిక్.

కన్నతల్లికి చిత్రహింసలు

సూళ్లూరుపేట, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): కన్నతల్లిని తనయుడు చిత్రహింసలు పెట్టిన ఘటన సూళ్లూరుపేట పట్టణంలో వెలుగు చూసింది. సూళ్లూరుకు చెందిన కొప్పోలు రామారావు తన తల్లిని కొట్టి, గోడకేసి మొత్తి చిత్రసింహలు పెట్టాడు. చుట్టుపక్కల వారు గమనించి పోలీసులకు సమాచారమిచ్చారు. వెంటనే రామారావును పోలీస్ స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చి పంపించినట్లు పోలీసులు తెలిపారు. కన్నతల్లిని కొడుతూ చిత్రహింసలు పెట్టిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

విహారంలో విషాదం

- భూపతీశ్వరకోనలో చెన్నై యువకుడి మృతి


సచిన్ (ఫైల్ ఫొటో)

సత్యవేడు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): విహార యాత్రకు వచ్చిన యువకుడు నీట మునిగి మృతి చెందాడు. ఈ ఘటన నాగలాపురం మండలం భూపతీశ్వరకోనలో ఆదివారం జరిగింది. నాగలాపురం ఎస్‌ఐ సునీల్ తెలిపిన ప్రకారం.. టీపీకోట సమీపంలోని భూపతీశ్వర కోన జలపాతానికి చెన్నైకు చెందిన నలుగురు యువకులు వచ్చారు. కోనలో సరదాగా కాసేపు గడిపి, స్నానం కోసం మడుగులో దిగారు. వీరిలో సచిన్ (22) నీట మునిగి ఎంత సేపైనా బయటకు రాలేదు. మిగిలిన ముగ్గురు స్నేహితుల్లో ఒకరైన హేమంత్ 100కు డయల్ చేసి సమాచారమిచ్చాడు. ఆ వెంటనే నాగలాపురం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని తీవ్రంగా గాలించారు. మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం సత్యవేడు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సచిన్ తమిళనాడు రాష్ట్రం తిరుప్పూర్‌కు చెందిన మూర్తి కుమారుడు. చెన్నై గిండిలోని రాంకో సిస్టమ్స్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న ఇతడు స్నేహితులతో కలిసి ఉంటున్నట్లు తెలిసింది.

టెన్త్ విద్యార్థులకు నేటినుంచి రెమిడియల్ క్లాసులు

తిరుపతి(విద్య), ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పదో తరగతి ఫెయిలైన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సోమవారం నుంచి రెమిడియల్ క్లాసులు నిర్వహించనున్నారు.విద్యార్థులు ఎక్కువగా గణితం, జనరల్ సైన్స్‌లో ఫెయిలైనట్టు విద్యాశాఖాధికారులు గుర్తించారు. ఆయా విద్యార్థులు రానున్న సప్లిమెంటరీ పరీక్షల్లో ఉత్తీర్ణులయ్యేలా చర్యలు చేపట్టారు. ఆయా సబ్జెక్టుల ఉపాధ్యాయులతో ప్రత్యేక తరగతులు నిర్వహించేలా ఏర్పాట్లు చేశారు. మండలానికి రెండు,మూడు పాఠశాలల చొప్పున మొత్తం85 పాఠశాలల్లో రెమిడియల్ తరగతులు నిర్వహించనున్నారు. ప్రతీరోజూ ఉదయం 8నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు తరగతులు నిర్వహిస్తున్నట్లు డీఈవో కేవీఎన్ కుమార్ తెలిపారు.ఫెయిలైన విద్యార్థులు క్రమం తప్పకుండా రెమిడియల్ క్లాసులకు హాజరయ్యేలా పెద్దలు కూడా బాధ్యత వహించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.


అభిమానులతో సెల్ఫీ దిగుతున్న నాని

తిరుమలలో హిట్-3 బృందం

- నడిచి కొండకు చేరుకున్న నాని, శ్రీనిధిశెట్టి

తిరుమల, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో హీరో నాని ఆదివారం సందడి చేశారు. హీరోయిన్ శ్రీనిధి శెట్టి , హిట్-3 సినిమా బృందంతో కలిసి తెల్లవారు జామున సుప్రభాత సేవలో పాల్గొన్న ఆయన ఆ తర్వాత ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. ప్రతిఏడాది శ్రీవారి దర్శనానికి వస్తుంటానని, అలాగే ప్రతి సినిమా ముందుకు తిరుమలకు రావడం అనవాయితీగా మారిపోయిందన్నారు. ఒకవేళ రాకపోతే ఏదో అసంపూర్ణంగా ఉంటుందన్నారు. ఆలయం ముందు హీరో, హీరోయిన్‌లతో కలిసి సెల్ఫీలు తీసుకునేందుకు ఎగబడ్డారు. అలాగే గ్యాలరీల్లో ఉన్న కొంతమంది భక్తుల వద్దకు హీరో నాని వెళ్లి పలకరించారు. వారితో సెల్ఫీలు దిగి ఉల్లాసంగా గడిపారు. శనివారం రాత్రి నాని, శ్రీనిధిశెట్టి కాలినడకన తిరుమలకు చేరుకున్నారు. భక్తులు గుర్తించకుండా ఉండేందుకు నాని నడకదారిలో ముఖానికి మాస్క్‌లా గుడ్డ కట్టుకున్నారు.



తిరుమల కిటకిట

సొంత, అద్దె వాహనాల్లో, శ్రీవారి మెట్టు.. అలిపిరి కాలిబాటల్లో, ఆర్టీసీ బస్సుల్లో తిరుమల కొండకు ఆదివారం భక్తులు పోటెత్తారు. వారాంతం, వేసవి సెలవుల నేపథ్యంలో శుక్రవారం సాయంత్రం నుంచే రద్దీ పెరిగింది. ఆదివారమూ కొనసాగింది. తిరుమలలో ఎటు చూసినా భక్తులే గుంపులు గుంపులుగా కనిపించారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

అలిపిరి పాదాల మండపం వద్ద కొబ్బరి కాయలు కొట్టి కాలినడకన తిరుమల వెళుతున్న భక్తులు

ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా రవిప్రభు

- రుయా సూపరింటెండెంట్‌గా డాక్టర్ రాధ


డాక్టర్ రవిప్రభు

తిరుపతి(వైద్యం), ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి) : రుయాస్పత్రి సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ జి.రవిప్రభు ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా నియమితులయ్యారు. రుయాలో అనస్థీషియా విభాగాధిపతిగా ఉన్న డాక్టర్ జె.రాధను రుయా సూపరింటెండెంట్‌గా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు వీరు బాధ్యతలు స్వీకరించనున్నారు.

- వివిధ సేవా టిక్కెట్లు, ప్రసాదాలు కలిపి రూ.కోటి ఆదాయం
- వాయులింగేశ్వరుడి దర్శనానికి పోటెత్తిన భక్తజనం



ముక్కంటి ఆలయంలో 8,766 రాహుకేతు పూజలు

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో రాహుకేతు పూజల సంఖ్య ఆదివారం సరికొత్త రికార్డుగా నమోదైంది. ఒక్క రోజే ఐదు విభాగాలు కలిపి మొత్తం 8,766 రాహుకేతు సర్పదోష నివారణ పూజలు నమోదయ్యాయి. ఇందులో రూ.500 రాహుకేతు టిక్కెట్ల ద్వారా 4,739మంది, రూ.750 టిక్కెట్ల ద్వారా 2,481, రూ.1,500 టిక్కెట్ల ద్వారా 862మంది, రూ.2,500 టిక్కెట్ల ద్వారా 492మంది, రూ.5వేలు టిక్కెట్ల ద్వారా 192మంది పూజలు చేయించుకున్నారు. వివిధ సేవలు, ప్రసాదాల ద్వారా ఆలయానికి రికార్డుస్థాయిలో ఆదాయం నమోదైంది. వివిధ సేవల ద్వారా రూ.1,02,62,356 ఆదాయం వచ్చింది. అందులో ఆశీర్వాదం 1, స్వామి అమ్మవార్ల అభిషేకం 139, శనీశ్వర స్వామి అభిషేకం 42, మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం 38, గోపూజ 46, మృత్యుంజయస్వామి అభిషేకం 4, రుద్ర హోమం 6, సుప్రభాత సేవ 16, చండీ హోమం 13, నిత్య కల్యాణం 5, అర్చన 116గా నమోదైంది. ఇక ఐదు రకాల ప్రసాదాలు కలిపి 28,470 అమ్ముడైనట్లు ఆలయాధికారులు తెలిపారు

ఆలయంలో భక్తుల రద్దీ

ఆదివారం అమావాస్య కలిసి రావడంతో భక్తులు అధిక సంఖ్యలో విచ్చేశారు. శనివారం రాత్రే పట్టణంలోని లాడ్జీలన్నీ భక్తులతో నిండిపోయాయి. ఆదివారం వేకువజాము నుంచే స్వామిఅమ్మవార్లను దర్శించుకునేందుకు క్యూలో బారులు తీరారు. రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర నుంచీ పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చారు. ఉదయం నుంచి రాత్రి వరకు సుమారు 35 వేలమంది స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. రూ.500 అంతరాలయ దర్శనం 563 మంది, రూ.200 శీఘ్ర దర్శనం టిక్కెట్ల ద్వారా 5,769 మంది, రూ.50ప్రత్యేక దర్శనం టిక్కెట్ల ద్వారా 4,109 మంది స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు



బన్నీ వాసు- జోగినాయుడు - రాశి సింగ్ - హవీష్

తిరుమల, ఏప్రిల్27(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని ఆదివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. ప్రభుత్వ విప్ గణబాబు, సినీ నిర్మాత బన్నీ వాసు, నటులు హవీష్, రాశి సింగ్, జోగినాయుడు ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు.

శిల్పారామంలో ఆర్ట్స్, క్రాఫ్ట్స్‌పై శిక్షణ



శిక్షణ వివరాల బ్రోచర్ చూపుతున్న సుధాకర్

తిరుచానూరు, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి):శిల్పారామంలో శాస్త్రీయ నృత్యం, మట్టికుండలు, మట్టి బొమ్మల తయారీ, చిత్రలేఖనంపై శిక్షణాతరగతులు నిర్వహించనున్నట్లు సంస్థ ఏవో సుధాకర్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ మే 1 నుంచి 31వ తేదీ వరకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1గంటవరకు తరగతులు జరుగుతాయన్నారు. 6 నుంచి 16 సంవత్సరాల వయసున్న విద్యార్థులు అర్హులన్నారు. కోర్సుల శిక్షణ కోసం నెలకు రూ.వెయ్యి ఫీజు చెల్లించి పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. కోర్సు పూర్తి చేసుకున్న వారికి ధ్రువపత్రాలను అందజేయనున్నట్లు తెలిపారు. శిక్షణకు అవసరమయ్యే వస్తువులను విద్యార్థులే తెచ్చుకోవాలని సూచించారు. వరిన్ని వివరాలకు 8886652044 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలన్నారు.

నృత్యం సమ్మోహనం



తిరుచానూరు, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): శిల్పారామంలో వారాంతపు సెలవుల్లో భాగంగా ఆదివారం కళాకారులు ప్రదర్శించిన నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. చెన్నైకు చెందిన సుధారాజన్, కైరాలి నృత్య కళానిలయానికి చెందిన కళాకారులు శ్రీనిధి, తంగబాల, కనిష్క, పల్లవి, సంయుక్త తదిరులు పుష్పాంజలి, జగదీశ్వర స్వరం, చిన్న చిన్న పాదం, జాతీశ్వరం మురళిధర గౌతమ్, శైలసుతతదితర పాటలకు నృత్యం చేశారు. సంగీత శివకుమార్, జ్యోషిత, కీర్తి, కార్తీక, సాయి హర్షిణి, తనశ్రీ ప్రభో గణపతే, కొండైముడి, ఓంకార నాదమయ, శంకర శంకర తదితర పాటలకు నృత్యాలు చేశారు. వారికి శిల్పారామం ఏవో సుధాకర్ జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలను అందజేశారు.

నేటి నుంచి వేసవి విజ్ఞాన శిబిరాలు

చంద్రగిరి, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): స్థానిక బజారు వీధి గ్రంథాలయంలో ఈనెల 28 నుంచి జూన్ 6 వరకు వేసవి విజ్ఞాన శిబిరాలు నిర్వహించనున్నట్లు గ్రంథాలయ అధికారి రెడ్డమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. కథలు చదవడం, చెప్పడం, పుస్తక పఠనం, జీకే, క్విజ్, డ్రాయింగ్, చెస్, క్యారమ్స్ వంటి సృజనాత్మక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. రోజూ ఉదయం 8 నుంచి 11 గంటల వరకు కార్యక్రమాలు ఉంటాయన్నారు. విద్యార్థులకు వివిధ రకాల పోటీలు నిర్వహించి, ప్రతిభకనబరిన వారికి బహుమతులు ప్రదానం చేస్తామన్నారు. వేసవి శిబిరాలలో పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికేట్లు ఇస్తామన్నారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ప్రమాదకరంగా మారిన విద్యుత్ స్తంభం



చంద్రగిరి, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): రెడ్డివారిపల్లె వద్ద విద్యుత్ స్తంభం ప్రమాదకరంగా తయారైంది. ఆదారిలో వెళ్లాలంటే గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. నెల రోజుల క్రితం ఈదురు గాలులకు విద్యుత్ స్తంభం విరిగిపోయింది. విద్యుత్ అధికారులకు వెంటనే ఫిర్యాదు చేసినా ఇంతవరకు పట్టించుకోలేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మళ్లీ ఈదురు గాలులు వస్తే స్తంభం పూర్తిగా విరిగిపోయే ప్రమాదముంది.విద్యుత్ అధికారులు స్పందించి వెంటనే స్తంభాన్ని మార్చాలని స్థానికులు కోరుతున్నారు.

ఆర్‌సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా బాలకృష్ణ



చంద్రగిరి, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): చంద్రగిరికి చెందిన బాపనపట్టు బాలకృష్ణ భారత విప్లవ కమ్యూనిస్టు పార్టీ (ఆర్‌సీపీఐ)రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా ఎన్నికయ్యారు. సత్యసాయి జిల్లా కదిరిలో ఇటీవల జరిగిన పార్టీ ప్రథమ సభల్లో ఆయనకు ఈపదవి లభించింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమిస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్లకు అప్పగించి కీలు బొమ్మగా మారిందని విమర్శించారు.

వైసీసీ నేత కలిపేసుకున్న కాలువ భూమి సర్వే



సర్వే చేస్తున్న రెవెన్యూ అధికారులు

తిరుపతి రూరల్,ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): రూరల్ మండలం పైడిపల్లెలో సర్వే నంబరు 195/1లోని కాలువ పోరంబోకు స్థలాన్ని ఆదివారం ఉదయం రెవెన్యూ అధికారులు సర్వే చేశారు. కాలువ భూమినీ కలిపేసుకున్నారని మీడియాలో వచ్చిన కథనంపై తహసీల్దార్ రామాంజులునాయక్ స్పందించారు. ఆర్ఐ రఘువర్మ నేతృత్వంలో స్థానిక వీఆర్వో మురళి, విలేజ్ సర్వేయర్ స్థలాన్ని సందర్శించి కాలువభూమికి హద్దులు నిర్ధారించారు. తొండవాడకు చెందిన వైసీపీ నేత ఒకరు తన పట్టా భూమిలోకి ఏర్పాటు చేసిన దారికోసం నాలుగుసెంట్లకు పైగా కాలువ స్థలాన్ని రోడ్డుకు కలిపేసుకున్నారని గుర్తించారు. కాలువ స్థలంలో రోడ్డు తొలగిస్తామని తహసీల్దార్ పేర్కొన్నారు.

పార్క్ స్థలంలో అడ్డగోలుగా దారి ఏర్పాటుయత్నం

● అడ్డుకున్న స్థానికులు, పంచాయతీ అధికారులు



రోడ్డు ఏర్పాటుకు ప్రయత్నించిన పార్క్‌స్థలం

తిరుపతి రూరల్, ఏప్రిల్27(ఆంధ్రజ్యోతి): వేదాంతపురం పంచాయతీ సర్వే నంబరు 248లోని స్వర్ణలేఅవుట్‌కి సంబంధించిన పార్క్‌స్థలం వివాదంగా మారింది. ఈస్థలాన్ని ఆనుకుని ఉన్న ప్లాట్‌ను కొనుగోళ్లు చేసిన ఓవ్యక్తి దీనిలో రోడ్డు ఏర్పాటు చేసేందుకు ప్రయత్నించారు.దీంతో స్థానికులు అడ్డుకున్నారు. పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేశారు. పంచాయతీ కార్యదర్శి మునీశ్వరి స్థానికులతో కలసి స్థలాన్ని పరిశీలించారు. రోడ్డు ఏర్పాటు ప్రయత్నాన్ని నిలుపుదల చేశారని తెలిసింది. మరోపక్క ఇదే పార్క్ స్థలంలో ఇప్పటికే ఓదారిని నిర్మించి వినియోగిస్తున్నారు. దీనిపై కార్యదర్శిని వివరణ కోరగా..పార్క్‌స్థలాన్ని సర్వేచేసి హద్దులు గుర్తించి రక్షణ చర్యలు చేపడతామన్నారు.

టీడీపీ నేత కారు ధ్వంసం

భాకరాపేట, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): చిన్నగొట్టిగల్లు మండలం టి.చట్టివారిపాళెం పంచాయతీ వంకమద్దివారిపల్లెకు చెందిన టీడీపీ సీనియర్ నేత వంగిమళ్ల మల్లిఖార్జునరెడ్డి కారును శనివారం రాత్రి అదే గ్రామానికి చెందిన సుజిత్ రెడ్డి ధ్వంసం చేసినట్లు భాకరాపేట పోలీసులకు ఫిర్యాదు అందింది. బాధితుడు మల్లిఖార్జున రెడ్డి మాట్లాడుతూ తనకారును శనివారం రాత్రి ఇంటి ఎదురుగా ఉన్న షెడ్డులో పార్కింగ్ చేశామన్నారు. అర్ధరాత్రి పెద్ద శబ్దం రావడంతో తనతోపాటు చుట్టుపక్కల వారు బయటకు వచ్చామన్నారు. అప్పటికే సుజిత్ రెడ్డి కారు అద్దాలను పగలగొట్టి పారిపోతుండగా పట్టుకునేందుకు విఫలయత్నం చేశామన్నారు. ఈ సమాచారం తెలుసుకుని ఎమ్మెల్యే పులివర్తి నాని ఆదివారం వెళ్లి ధ్వంసమైన కారును పరిశీలించారు. నిందితులపై చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించారు.

చంద్రగిరి

సర్వదర్శనానికి 14 గంటలు

తిరుమల, ఏప్రిల్27 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 14 గంటల సమయం పడుతోంది. ఆదివారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్-2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరి ఉద్యానవనంలో నాలుగు షెడ్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్-1లో ఆరు కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు. శుక్రవారం రూ.3.24 కోట్లు హుండీ ఆదాయం లభించింది. శనివారం శ్రీవారిని దర్శించుకున్న 82,811 మంది దర్శించుకున్నారు. 34,913 మంది తలనీలాలు సమర్పించుకున్నారు.

ఏఎంసీ డైరెక్టరుగా మురళి



భాకరాపేట, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మార్కెట్ కమిటీ డైరెక్టరుగా చిన్నగొట్టిగల్లు మండలం నెల్లుట్లవారిపల్లె పంచాయతీ ఎగువ గుంతటివారిపల్లెకు చెందిన టీడీపీ సీనియర్ నేత గుంతాటి మురళీ నియమితులయ్యారు. తనకు పదవి రావడానికి కృషి చేసిన ఎమ్మెల్యే పులివర్తి నానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు

ఏఎస్ఐ శేఖర్‌కు సన్మానం



శేఖర్ దంపతులను సన్మానిస్తున్న డీఎస్పీ

రామచంద్రాపురం, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): ఆర్‌సీపురం పోలీస్‌స్టేషన్‌లో ఈ నెల 30న రిటైరవుతున్న ఏఎస్ఐ శేఖర్‌ను మిట్టూరు కమ్యూనిటీ భవనంలో ఆదివారం పోలీసులు, వివిధ పార్టీల నాయకులు సన్మానించారు. డీఎస్పీ ప్రసాద్ మాట్లాడుతూ 38 ఏళ్ల పాటు విధి నిర్వహణలో ఎలాంటి మచ్చలేకుండా పనిచేసిన శేఖర్‌రెడ్డిని ఆదర్శంగా తీసుకుని పనిచేయాలని కోరారు. శేఖర్ దంపతులను సన్మానించి పుష్పగుచ్ఛాలు అందజేశారు. సీఐ సుబ్బిరామిరెడ్డి, ఎస్ఐ రవీంద్రనాథ్, టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు తిరుమలరెడ్డి, జనార్దన్ చౌదరి, హరిప్రసాద్‌నాయుడు, మునిరామిరెడ్డి, సుగుణమ్మ, పోలీసులు రాజశేఖర్, మహేష్, వెంకటేష్, రమేష్‌రెడ్డి, దివ్య, పాల్గొన్నారు.

ఆడపిల్లల సంరక్షణపై అవగాహన

రామచంద్రాపురం, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని పిల్లారికోన ఎస్టీకాలనీలో ఏకవీర ఫౌండేషన్ మహిళా విభాగం ఆధ్వర్యంలో మహిళలు, ఆడపిల్లల సంరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈక్రమంలో ఆడపిల్లలకు నాప్కిన్స్‌ను పంపిణీ చేశారు. నెలసరి సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను డాక్టర్ లావణ్య వివరించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ వ్యవస్థాపకులు, సభ్యులు దీప, నాగస్వప్న, తేజ, రూప తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అమావాస్య ఉత్సవం



శ్రీకాళహస్తి, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాల యంలో ఆదివారం అమావాస్య ఉత్సవం నేత్రపర్వంగా జరిగింది. జ్ఞానప్రసూనాంబ సమేత ముక్కంటీశుడి ఉత్సవమూర్తులకు ఆలయంలోని అలంకార మండపంలో విశేషంగా అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అలంకరించి ధూప,దీప, నైవేద్యాలను సమర్పించారు. మేళతాళాలు, మంగళవాయిద్యాలు, వేదమంత్రాల నడుమ స్వామిఅమ్మవార్లు పురవీధుల్లో ఊరేగారు. భక్తులు కర్పూర హారతులు సమర్పించారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



వాకాడు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): చేపల వేట నిషేధ సమయంలో మత్స్యకారుల భృతి రూ.20వేలకు పెంచి ఇవ్వడం పట్ల మత్స్యకారులు హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం వైట్‌కుప్పం గ్రామం లో మత్స్యకారుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మామిడి గోవిందయ్య ఆధ్వర్యంలో సీఎం చంద్రబాబునాయుడు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కేక్ కట్‌చేసి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో బాబు, వెంకటేశ్వర్లు, తిరుమల తదితరులు పాల్గొన్నారు.

వకుళమాత ఆలయంలో శరవేగంగా అభివృద్ధి పనులు



భక్తుల వసతి సముదాయం,కల్యాణ మండపం నిర్మాణ పనులు



మెట్లదారిలో భక్తులకు ఆహ్లాదం పంచుతున్న పూలవనాలు

తిరుపతి రూరల్, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): పేరూరుబండపై వెలసిన వకుళామాత అమ్మవారి ఆలయంలో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయి. జీర్ణోద్ధరణ తర్వాత 2022 జూన్23న ఆలయాన్ని టీటీడీకి అప్పగించాక భక్తుల ఆదరణ పెరిగింది. అయినా గత వైసీపీ ప్రభుత్వంలో నామమాత్రపు వసతులతోనే సరిపెట్టారు. అప్పట్లో ఆలయంలో అభివృద్ధి పనులకు టీటీడీ పాలకమండలి రూ.9.11కోట్లు మంజూరు చేసింది. ఈక్రమంలో ప్రస్తుతం మాస్టర్‌ప్లాన్ ప్రకారం పనులను చేపడుతున్నారు. యాత్రికులవసతి సముదాయం(పీఏసీ), కల్యాణ మండపం నిర్మాణ పనులు యుద్ధ ప్రాతిపదికన చేపట్టారు. నైవేద్య విరామ సమయంలో గోపురం ఎదుట వేసవిని దృష్టిలో ఉంచుకుని ఇటీవల చలువ పందిళ్లను ఏర్పాటు చేశారు. ఇక్కడ శాశ్వత షెడ్డు నిర్మించాలని భావిస్తున్నారు. ఆలయప్రాంగణంలో దక్షిణ వైపున గోపురం కనిపించేలా వైట్‌షీట్ రేకులషీట్లు ఏర్పాటు చేశారు. పార్కింగ్ ఏరియాను విస్తృతపరిచారు. గార్డెనింగ్ పనులు సాగుతున్నాయి. ఆలయానికి చేరుకునే మెట్లదారిలో అందమైన మొక్కలతో గార్డెనింగ్‌ను తీర్చిదిద్దారు. ఆహ్లాదకర వాతావరణం ఏర్పడటంతో భక్తులు ఫోటోలు దిగుతున్నారు. కొంతసేపు సేదదీరుతున్నారు. కిందనుంచి కొండమీదకు భక్తులు సులభంగా చేరుకునేందుకు లిఫ్ట్ ఏర్పాటు చేసేందుకు టీటీడీ పాలకమండలి ఆమోదించిందని తెలిసింది. దీనిని రెండవగోపురం వద్ద ఏర్పాటు చేయాలని అధికారులు భావిస్తున్నట్లు సమాచారం.

సిద్ధయ్య కుటుంబానికి అండగా ఉంటాం : ఎమ్మెల్యే నాని



సిద్ధయ్య కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే నాని

భాకరాపేట, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): ఏనుగు దాడిలో మృతి చెందిన సిద్ధయ్య కుటుంబానికి అండగా ఉంటామని ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. ఆదివారం ఆయన చిట్టేచర్ల పంచాయతీ దాసరిగూడెం వెళ్లి మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి త్వరగా పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. అటవీ సరిహద్దు గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎమ్మెల్యే వెంట టీడీపీ ప్రధాన కార్యదర్శి మదనమోహన, తెలుగు మహిళా అధ్యక్షురాలు చిట్టెమ్మ, ఆర్వీ రమణా రెడ్డి, మోహన్ రెడ్డి, కుమారస్వామి రెడ్డి, వెంకటరత్నం, సహదేవరెడ్డి, చంద్రశేఖర్, గురుమూర్తి, మురళీ, శేఖర్‌గౌడ్, చంద్రశేఖర రెడ్డి, చాన్ బాషా, కృష్ణమూర్తి, లోకనాథం, రెడ్డప్ప రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పంట పొలాలపై కొనసాగుతున్న గజ దాడులు



ఏనుగుల దాడిలో ధ్వంసమైన వరిపంటను పరిశీలిస్తున్న రైతులు, అధికారులు

పాకాల, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గానుగపెంట పంచాయతీ పరిధిలో రెండవరోజు కూడా ఏనుగులు విరుచుకుపడ్డాయి. శనివారం రాత్రి చిన్నపాపయ్యగారిపల్లెకు చెందిన రైతులు రమేష్, రాఘవులు సాగుచేసిన వరిపొలాలను ధ్వంసం చేశాయి. గానుగపెంటకు చెందిన సోమశేఖర్, గురుదేవలకు చెందిన బొప్పాయి, అరటి, టెంకాయ చెట్లను విరిచేశాయి. దనూజవారిపల్లెకు చెందిన సురేంద్రరెడ్డి, బాబుల మామిడితోటల పెన్సింగ్ ధ్వంసం చేసి చెట్లు విరిచేశాయి. చేతికి వచ్చిన వరిపైరును తొక్కేసి తీవ్ర నష్టం కలిగించాయి. ఏనుగుల దాడుల్లో రైతులు తీవ్రంగా నష్టపోయారు. రాత్రుల్లో ఇండ్లలో నుండి బైట రావాలంటేనే భయపడుతున్నారు. శుక్రవారం రాత్రి గానుగపెంట పరిసరాలలో పలువురు రైతులు సాగుచేసిన పంటలను నాశనం చేశాయి. వరుస దాడులతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

కంబాలమిట్టలో ఉత్సాహంగా పశువుల పండగ



పరుగులు తీస్తున్న కోడెగిత్తలను నిలువరించేందుకు ప్రయత్నిస్తున్న యువకులు

పాకాల, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): కావలివారపల్లె పంచాయతీ కంబాలమిట్టలో ఆదివారం ఘనంగా పశువుల పండుగ జరిగింది. పశువులకు పూజలు చేసి ఊరేగించారు. కోడెగిత్తలను ముస్తాబు చేసి కట్టి జల్లికట్టు నిర్వహించారు. కోడెగిత్తలను నిలవరించడానికి కొమ్ములకు కట్టిన బహుమతులు దక్కించుకోవడానికి యువకులు ఉత్సాహంగా పోటీపడ్డారు. అమ్మగారిపల్లె, కెవడ్డేపల్లెకు చెందిన వైసీపీ మద్దతుదారులు హంగామా చేయడానికి ప్రయత్నించడంతో కొంత ఘర్షణ చోటుచేసుకుంది. ఇరువర్గాల రాళ్లతో దాడితో ఉద్రిక్తత నెలకొంది. సీఐ సుదర్శన ప్రసాద్ చేరుకొని బందోబస్తు ఏర్పాటు చేశారు.

అన్న ప్రాణం తీసిన తమ్ముడి తప్పు



మృతి చెందిన నాగరాజు

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): తప్పు చేసింది తమ్ముడు. దీని పర్యవసానం అన్న బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ విషాద ఘటన తిరుపతిలో చోటుచేసుకుంది. మృతుడి బంధువులు ఆదివారం తెలిపిన ప్రకారం.. నెల్లూరు జిల్లా కొండాపురం మండలం కొమ్ముపాలేనికి చెందిన నాగరాజు(28) ఉపాధి నిమిత్తం తిరుపతికి వచ్చాడు. బేల్దారి పని చేస్తూ భార్యతో కలిసి ఉంటున్నాడు. అతడి తమ్ముడు దగదర్తికి చెందిన ఓ వివాహితతో సంబంధం పెట్టుకుని ఆమెను తిరుపతిలోని అన్న దగ్గరకు తీసుకెళ్లాడు. ఆ వివాహిత బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేయగా గొడవలు జరిగాయి. దీనిని అవమానంగా భావించి నాగరాజు ఇంట్లోనే ఉరేసుకున్నాడు.

కోట - తిరుపతి ఆర్టీసీ సర్వీస్ ప్రారంభం



ఆర్టీసీ సర్వీస్‌ను ప్రారంభిస్తున్న ఆర్ఎం నరసింహులు, టీడీపీ మండల అధ్యక్షుడు గణపర్తి కిషోర్ నాయుడు

చిట్టమూరు, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): కోట నుంచి వాకాడు, చిట్టమూరు మీదుగా తిరుపతికి ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ సర్వీస్‌ను ఆదివారం చిట్టమూరు ఆర్టీసీ బస్టాండ్ వద్ద తిరుపతి ఆర్ఎం నరసింహులు, టీడీపీ మండల అధ్యక్షుడు గణపర్తి కిషోర్ నాయుడు ప్రారంభించారు. ఈ సర్వీస్ కోటలో ప్రతిరోజూ ఉదయం 6, మధ్యాహ్నం 12గంటలకు, అలాగే తిరుపతిలో ఉదయం 9, సాయంత్రం 6 గంటలకు బయలుదేరుతుంది. కార్యక్రమంలో వాకాడు డిపో మేనేజర్ పెంచలయ్య, ఎంపీడీవో మనోహర్ గౌడ్, ఎస్ఐ చిన్న బలరామయ్య, మెకానికల్ ఇంజనీర్ నారాయణ, సూపర్‌వైజర్ రఘురామయ్య, టీడీపీ నాయకులు బాబు నాయుడు, జనార్దనరెడ్డి, రాజేష్‌రెడ్డి, చిన్నారావు, కండక్టర్ నరసింహులు, డ్రైవర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

తిరుమల ఘాట్‌లో టైరు పేలి సుమో బోల్తా



తిరుమల, ఏప్రిల్27(ఆంధ్రజ్యోతి): తిరుమల నుంచి తిరుపతికి చేరుకునే మొదటి ఘాట్‌రోడ్డులో ఆదివారం సుమో బోల్తాపడింది. విజయనగరంకు చెందిన కుటుంబంలోని ఐదుగురు ప్రయాణికులు స్వల్పగాయాలతో బయటపడ్డారు. వినాయకస్వామి ఆలయం సమీపానికి రాగానే సుమో ముందు టైర్ పేలిపోవడంతో వాహనం అదుపుతప్పి బోల్తాపడింది. ఆ వాహనాన్ని టీటీడీ ఆటోక్లీనిక్ పక్కకు తొలగించి ట్రాఫిక్ సమస్యను పరిష్కరించారు.

వి.కోట పంచాయతీలో రూ.50 లక్షల దుర్వినియోగం

● ఇద్దరు ఉద్యోగుల సస్పెన్షన్

చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): వి.కోట పంచాయతీలో రూ.50 లక్షల నిధులు దుర్వినియోగం అయ్యాయి. దీనికి కారకులైన ఇద్దరు ఉద్యోగులను కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశాలతో డీపీవో సుధాకర్ రావు శనివారం రాత్రి సస్పెండ్ చేశారు. పొలకల పంచాయతీలో ప్రస్తుతం జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న యాదవపతి గతంలో డిప్యుటేషన్‌పై వి.కోట పంచాయతీ ఇన్‌చార్జి ఈవోగా విధులు నిర్వహించారు. అతడితోపాటు అప్పటి బిల్ కలెక్టర్ పృథ్వి, మరో కాంట్రాక్టు ఉద్యోగితో కలిసి ప్రజలు చెల్లించిన పన్నులు, పన్నేతర నిధులను పంచాయతీ ఖాతాల్లో జమచేయకుండా రూ.1.50 కోట్లు దుర్వినియోగం చేసినట్లు అధికారులకు స్థానికులు ఫిర్యాదు చేశారు. దీనిపై డీఎల్పీవోస్థాయి అధికారి ప్రాథమిక విచారణ చేశారు. రూ.50 లక్షలు పక్కదారి పట్టినట్లు నిర్ధారించారు. ఇందులో యాదవపతి రూ.16లక్షలు, పృథ్వి రూ.13 లక్షలు వారి సొంతానికి వాడుకున్నట్లు తేలింది. దీంతో రూ.10లక్షలు వారు పంచాయతీ ఖాతాకు జమచేశారు. మిగిలిన మొత్తాన్ని చెల్లించకపోవడంతో నిధుల దుర్వినియోగానికి పాల్పడిన కారణంగా ఇద్దరినీ సస్పెండ్ చేసినట్లు డీపీవో వివరించారు.

భక్తులతో కిటకిటలాడిన చెంగాళమ్మ ఆలయం



సూళ్లూరుపేట, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని చెంగాళమ్మ ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. అమావాస్య రోజు రాత్రి ఆలయంలో నిద్రిస్తే కోర్కెలు నెరవేరి మంచి జరుగుతుందని భక్తుల నమ్మకం. దీంతో తమిళనాడు నుంచి భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి అమ్మవారిని దర్శించుకొని ఆలయ ఆవరణలో నిద్రించారు. అదే విధంగా వేనాడు దర్గాకు భక్తులు అధిక సంఖ్యలో తరలివెళ్లారు.

డీసీసీబీలో విచారణ పూర్తి

వచ్చేనెల 15 తర్వాత ప్రభుత్వానికి నివేదిక

చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ)లో గత పాలకవర్గం చేసిన ఆర్థిక విధ్వంసంపై కొనసాగుతున్న సహకార చట్టం సెక్షన్ 51 విచారణ శుక్రవారంతో ముగిసింది. దీనిపై వచ్చేనెల 15 తర్వాత ప్రభుత్వానికి సమగ్ర నివేదిక కలెక్టర్ పేరిట పంపనున్నట్లు తాజాగా తెలిసింది. ఐదేళ్ల వైసీపీ పాలనలో అప్పటి బ్యాంకు చైర్‌పర్సన్‌గా ఎం.రెడ్డమ్మ కొనసాగగా, ఆరుగురు సింగిల్ విండో అధ్యక్షులు డైరెక్టర్లుగా పనిచేశారు. అప్పట్లో జరిగిన అవినీతి అక్రమాలపై 'ఆంధ్రజ్యోతి'లో గత ఏడాది జూన్ 11, 12, నవంబరు 13వ తేదీల్లో కథనాలు ప్రచురితమైన విషయం పాఠకులకు తెలిసిందే. మరోవైపు మాజీ ఎమ్మెల్సీ దొరబాబు గత పాలకవర్గం తప్పిదాలపై సీఎం చంద్రబాబుకు ఫిర్యాదు చేశారు. దాంతో విచారణకు ఆదేశిస్తూ కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ క్రమంలో డీఆర్వో మోహన్‌కుమార్‌ను విచారణ అధికారిగా కలెక్టర్ నియమించారు. ఆయన ఈ ఏడాది మార్చి 21 నుంచి ఈనెల 25వ తేదీ వరకు బ్యాంకు ప్రధాన కార్యాలయంలో విచారణ చేపట్టారు. ఈ వ్యవహారంపై 80 మందికి సమన్లు జారీచేశారు. విచారణకు బ్యాంకు మాజీ చైర్‌పర్సన్ ఎం.రెడ్డెమ్మ, ఆమె భర్త కృష్ణమూర్తి, మాజీ డైరెక్టర్లు బి.కరుణాకర్ చౌదరి, డి.హరినాథ రెడ్డి, టి.ఊరప్ప, షేక్ మస్తాన్ సాహెబ్, ఎం.బాల సుబ్రహ్మణ్యం, జి.అరుణమ్మ, చైర్‌పర్సన్ అప్పటి పీఏ సుధాకర్, అప్పటి బ్యాంకు సీఈవో మనోహర్ గౌడ్, జీఎం లిల్లీ కేథరిన్, వివిధ బ్యాంకు బ్రాంచ్ మేనేజర్లు, సింగిల్‌విండో సీఈవోలు విచారణకు హాజరై తమపై వచ్చిన అభియోగాలకు వివరణలు ఇచ్చారు. వరదయ్యపాళెం సింగిల్‌విండో పరిధిలో 17 స్వయం సహాయక సంఘాల పేరిట వైసీపీ నాయకులు, కార్యకర్తలు.. బినామీ రూపంలో 2020-22 మధ్య రూ.1.30 కోట్ల రుణాలు పొందారు. అందరూ రూ.9లక్షలు చెల్లించగా, మిగతా పైకం వడ్డీతో కట్టాల్సి ఉంది. ఇప్పటివరకు 80మంది డ్వాక్రా సంఘం సభ్యులు విచారణకు హాజరవగా, మరో 90 మందిని మే 1న వరదయ్యపాళెంకు వెళ్లి డీఆర్వో విచారణ చేయనున్నట్లు సమాచారం.

డ్రోన్ సర్వేతో భూ తగాదాలకు చెక్

ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు


డ్రోన్ సర్వేను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

తిరుపతి(జీవకోన), ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): డ్రోన్ సర్వేతో భూ తగాదాలకు చెక్ పడుతుందని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. ఆదివారం స్థానిక వినాయకసాగర్ వద్ద నక్ష పైలెట్ ప్రాజెక్టు కింద అర్బన్ డ్రోన్ సర్వేను ఆయన ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ సర్వేతో నగరంలోని చెరువులు, కుంటలు, కాలువలు ఆక్రమణకు గురికాకుండా ఉంటాయని, తద్వారా రెవెన్యూ శాఖలో పారదర్శకత సాధ్యమవుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి కమిషనర్ అమరయ్య, ఏసీపీ బాలాజీ పాల్గొన్నారు.

ఇండోనేషియా వర్సిటీతో ఎంవోయూకు ఎస్వీయూ అంగీకారం


సమావేశమైన యూనివర్సిటీల ప్రతినిధులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): ఇండోనేషియా యూనివర్సిటీతో అవగాహనా ఒప్పందానికి ఎస్వీ యూనివర్సిటీ అంగీకరించింది. ఇందుకు సంబంధించి ఇరు యూనివర్సిటీల ప్రతినిధులు ఆదివారం సమావేశమయ్యారు. ఇండోనేషియాలో గల బాండూంగ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీకి చెందిన డాక్టర్ మిత్ర డీ జమల్ తదితరులు ఎస్వీయూ వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడితో సమావేశమయ్యారు. ఎంవోయూపై చర్చించారు. బోధన, పరిశోధన అంశాల్లో పరస్పర సహకారానికి నిర్ణయించారు. ఎస్వీయూ ప్రతినిధుల బృందం ఇండోనేషియాలో పర్యటించనుంది. జూలైలో ఎంవోయూ అధికారికంగా ఒప్పంద పత్రాలపై ఇరు యూనివర్సిటీల ప్రతినిధులు సంతకాలు చేయనున్నారు.

శిథిల ఆలయం.. గోపురాలను కాపాడాలి


రామగిరి ఆలయాన్ని సందర్శిస్తున్న శివనాగిరెడ్డి

తిరుపతి(కల్చరల్), ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): పిచ్చాటూరు మండలం రామగిరిలో వెయ్యేళ్ల నాటి శిథిల ఆలయం, గోపురాలను కాపాడుకోవాలని పురావస్తు పరిశోధకుడు, ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ సీఈవో డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి అన్నారు. గ్రామాల్లో వారసత్వ సంపద పరిరక్షణ అవగాహనలో భాగంగా ఆదివారం ఆయన రామగిరిని సందర్శించారు. వాలీశ్వర, కాలభైరవ దేవాలయాలను పరిశీలించారు. పల్లవుల కాలంలో నిర్మించి, చోళులు, విజయనగర రాజుల కాలంలో విస్తృతమైన ఆలయాలు, గోపురం రూపు కోల్పోతున్నాయన్నారు. అద్భుత వాస్తు శిల్పాలు కనుమరుగయ్యే ప్రమాదం ఉందన్నారు. చారిత్రక ప్రాధాన్యత కలిగిన ఈ ఆలయాలను, శిల్పాలను కాపాడి భవిష్యత్ తరాలకు అందించాలని గ్రామస్తులను కోరారు. కార్యక్రమంలో ఎస్వీ మ్యూజియం అధికారులు చల్లా శివకుమార్, హరిప్రసాద్ రెడ్డి, శ్రీకాంత్, చారిత్రక పరిశోధకుడు పాములపాటి శ్రీనాథ్ రెడ్డి పాల్గొన్నారు.

క్రీడలతో శారీరక దృఢత్వం.. మానసిక ఉత్సాహం


బ్యాడ్మింటన్‌లో విజేతలుగా నిలిచిన ఉద్యోగులు

తిరుపతి(వైద్యం), ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): క్రీడలు శారీరక దృఢత్వాన్ని, మానసిక ఉత్సాహాన్ని కలిగిస్తాయని స్విమ్స్ డిప్యూటీ డైరెక్టర్ సతీష్ పేర్కొన్నారు. స్విమ్స్ ఉద్యోగుల సంఘం, స్విమ్స్ అలైడ్ హెల్త్ పూర్వపు విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో తుమ్మలగుంటలోని న్యూస్లిమ్ బ్యాడ్మింటన్ ఇండోర్ స్టేడియంలో ఆదివారం షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. స్విమ్స్ ఉద్యోగులు, పూర్వ విద్యార్థులు పోటీపడ్డారు. ఎన్ఎస్ఆర్ మురళీకృష్ణ, ప్రకాష్ ప్రథమ స్థానంలో నిలిచారు. ద్వితీయ స్థానంలో మురళి, సురేష్, తృతీయ స్థానంలో రమేష్, శ్రీకాంత్ నిలిచారు. అనంతరం విజేతలకు జ్ఞాపికలు అందించారు. ఈ కార్యక్రమంలో స్విమ్స్ ఉద్యోగుల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బాబు సురేష్, రామమూర్తి, ఉపాధ్యక్షులు శివ, కోశాధికారి గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

హిందువులు ఏకం కావాలి

అభయ్ హిందూసేన వ్యవస్థాపకుడు రాధామనోహర్‌దాస్



తిరుపతి(కల్చరల్), ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): హిందువులందరూ ఏకమవ్వాల్సిన సమయం ఆసన్నమైందని, ఉగ్రవాదానికి వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం చేస్తున్న పోరాటానికి బాసటగా నిలవాలని అభయ్ హిందూసేన వ్యవస్థాపకుడు రాధామనోహర్‌దాస్ కోరారు. ఉగ్రదాడిని ఖండిస్తూ అభయ్ హిందూసేన ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి తుడా మైదానం నుంచి గాంధీ రోడ్డు వరకు ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో పృధ్వీరెడ్డి, గోపినాథ్, మహేష్, రెడ్డిశేఖర్, వేణురాయల్, నిర్మలమ్మ పాల్గొన్నారు.

స్కావెంజర్స్ కాలనీలో కార్డెన్ సెర్చ్

22 వాహనాల సీజ్


స్కావెంజర్స్ కాలనీలో తనిఖీలు చేస్తున్న పోలీసులు

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): పోలీసులు ఆదివారం తిరుపతిలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. డీఎస్పీ భక్తవత్సలం ఆధ్వర్యంలో సీఐలు శ్రీనివాసులు, రామయ్య, మురళీమోహన్, ఎస్ఐలు, సిబ్బంది కలిసి స్థానిక స్కావెంజర్స్ కాలనీలో ఇంటింటినీ గాలించారు. ఎవరెవరు ఉన్నారు? ఎక్కడి నుంచి వచ్చారు? ఏమి పనులు చేస్తున్నారు అనే వివరాలు తెలుసుకున్నారు. రికార్డులు లేని 22 వాహనాలను సీజ్ చేశారు.

ఘనంగా సిటీ టెర్రస్ గార్డెన్ వార్షికోత్సవం


సమావేశంలో పాల్గొన్న ప్రముఖులు

తిరుపతి (టీటీడీ), ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): తిరుపతి సిటీ టెర్రెస్ గార్డెన్స్ (సిటీజీ) 4వ వార్షికోత్సవాన్ని తిరుపతిలోని సరస్వతి శిశు మందిర్‌లో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా వచ్చిన ఎస్వీ యూనివర్సిటీ మాజీ వీసీ డాక్టర్ రాళ్లపల్లి రామమూర్తి, వ్యవసాయ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ హేమంత్ కుమార్ మాట్లాడుతూ మిల్లెట్స్ వల్ల కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. చిరు ధాన్యాలతో ఆరోగ్య రక్షణ ఎలా చేసుకోవాలో, అనారోగ్యాన్ని ఎలా దూరంగా ఉంచవచ్చో వివరించారు. అనంతరం సోషియల్ అగ్రికల్చర్ ఫార్మింగ్ చేస్తున్న డాక్టర్ ఎంసీ వెంకటనాథ్ ప్రసంగించారు. అనంతరం ఉత్తమ గార్డెన్స్ నిర్వహిస్తున్న వారికి అవార్డులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో సీటీజీ వ్యవస్థాపక సభ్యులు ప్రసన్నకుమారి, జీఎల్ మనోహర్, నదింపల్లి కృష్ణ, మోహన్‌రావు, సుధ, నాగశ్రీ, తేజోవతి తదితరులు పాల్గొన్నారు.

ఐహెచ్ఆర్ఏసీ అధ్యక్షుడిగా మురళి

తిరుపతి అర్బన్, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): ఇండియన్ హ్యూమన్ రైట్స్, యాంటీ కరప్షన్ సెల్ ఆలిండియా అధ్యక్షుడిగా తిరుపతికి చెందిన కాణిపాకం మురళి, ప్రధాన కార్యదర్శిగా ఎం.హరిబాబు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కె.వినోద్‌కుమార్ నియమితులయ్యారు. అప్పటి వరకు చైర్మన్‌గా ఉన్న కె.బి.కన్నన్ అధ్యక్షతన ఆదివారం చెన్నైలో జరిగిన సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు.

ఇళ్లస్థలాల కోసం పోరాడుదాం

తిరుపతి అర్బన్, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): కార్మికులకు ఇళ్లస్థలాల కోసం పోరాటాలు చేద్దామని బాలాజీ బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు కుప్పం శేఖర్ అన్నారు. ఆదివారం తిరుమల బైపాస్ రోడ్డులోని ద్వారక శిరిడీ సాయిబాబా మందిరంలో యూనియన్ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో కార్మికులకు పనులు దొరకవని, ఆ సమయంలో ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. మేడే వేడుకలకు సిద్ధం కావాలన్నారు. కార్యక్రమంలో తంగవేలు, అల్లాబక్షా, రమణ, సుబ్రహ్మణ్యం, రమణ పాల్గొన్నారు.

కోనోకార్పస్ మొక్కలను రక్షించండి

పర్యావరణవేత్త ప్రొఫెసర్ బయ్యపురెడ్డి


కోనోకార్పస్ మొక్కలపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇస్తున్న బయ్యపురెడ్డి

తిరుపతి(లీలామహల్), ఏప్రిల్27(ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల్లో కోనోకార్పస్ మొక్కపై నిరాధార నిందలు ఆపి ఎన్నో ప్రయోజనాల గల కోనోకార్పస్ మొక్కలను రక్షించాలని పర్యావరణవేత్త, ఆచార్య నాగార్జున యూనివర్సిటీ పూర్వ వృక్షశాస్త్ర ప్రొఫెసర్ కె.బయ్యపురెడ్డి కోరారు. జనచైతన్య వేదిక ఆధ్వర్యంలో ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో జరిగిన ముఖాముఖి కార్యక్రమానికి జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి, ప్రముఖ ఆడిటర్ పల్లుణ కుమార్, ఎస్వీ యూనివర్సిటీ జియాలజీ ప్రొఫెసర్ టి.వి.కృష్ణారెడ్డి, ఆల్ ఇండియా నేషనల్ బీసీ ఫ్రంట్ కన్వీనర్ కెఎం.ఎల్.నరసింహులు హాజరయ్యారు. బయ్యపురెడ్డి మాట్లాడుతూ కోనో కార్పస్ మొక్కలు మొదట యమన్ దేశంలో సహజసిద్ధంగా పెరిగి క్రమేణా ప్రపంచవ్యాప్తంగా విస్తరించాయన్నారు. దుబాయ్, కువైట్, అబుదాబి వంటి గల్ఫ్ దేశాల్లో నీరు లభించకపోయినా 70 శాతానికి పైగా పచ్చదనాన్ని అందిస్తున్నాయన్నారు. ఈ మొక్కలు కార్బన్ డైఆక్సైడ్‌ను అత్యధికంగా తీసుకుని అత్యధిక ఆక్సిజన్‌ను అందిస్తాయని తెలిపారు. ఇవి అన్ని రకాల నేలల్లో పెరుగుతాయని, కలుషిత నీటిని, భూమిని కాపాడడమేకాక, వాయు, ధ్వని కాలుష్యం నుంచి ప్రజలను రక్షిస్తాయని వివరించారు. నిర్వహణ వ్యయం అవసరం లేదన్నారు. విదేశీ మొక్క అనే విమర్శను ఖండిస్తున్నానని, టమోటా, ఆలుగడ్డలు, మిర్చి, కాఫీ, టీ, మిర్చి లాంటివి కూడా విదేశీ మొక్కలేనని గుర్తు చేశారు. అలర్జీ, ఆస్తమాలాంటి సమస్యలు వ్యక్తిగతమైనవని తెలుపుతూ బెంగళూరులోని అంతర్జాతీయ విద్యా సంస్థలు వేలాది కోనోకార్పస్ మొక్కలతో నిండి ఉన్నాయని, ఏ ఒక్క విద్యార్థికీ ఆస్మా, అలర్జీ సమస్య రాలేదని అన్నారు. ప్రపంచంలో సగటున ఒక్కొక్క మనిషికి 422 చెట్లు ఉండగా బ్రెజిల్‌లో 1,500, అమెరికాలో 720, కెనడాలో 318, చైనాలో 140 చెట్లు ఉండగా భారతదేశంలో కేవలం 28 మాత్రమే ఉన్నాయని వివరించారు. బహుళ ప్రయోజనాలు అందించే కోనోకార్పస్ మొక్కలను రక్షించడానికి రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, వృక్ష ప్రేమికులు కృషి చేయాలని కోరారు. కోనోకార్పస్ మొక్కలపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఆకట్టుకుంది.

ట్రంప్ నిర్ణయాలు దేశానికి ప్రమాదం

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

తిరుపతి(ఆటోనగర్), ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): అమెరికా ఆర్థిక వ్యవస్థను మెరుగుపరచుకోవడానికి ఆ దేశ అధ్యక్షుడు ట్రంప్ తీసుకుంటున్న నిర్ణయాలను అంగీకరిస్తే మన దేశం ప్రమాదంలో పడే అవకాశముందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనావాసరావు అన్నారు. యశోదనగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో ఆదివారం ట్రంప్ దూకుడు-భారత్‌పై ప్రభావం అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన శ్రీనివాసరావు మాట్లాడుతూ అమెరికాలో ట్రంప్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ధనవంతులకు మేలు జరిగే విధంగా పలు నిర్ణయాలు తీసుకుంటున్నారని, వాటిని అన్ని దేశాలు అమలు చేయాలని హుకుం జారీ చేయడం సరికాదని అన్నారు. వాటిని ఇక్కడ అమలు చేస్తే దేశ ఆర్థిక రంగంపై తీవ్ర ప్రభావం పడే అవకాశముందని తెలిపారు. దేశంలో వ్యవసాయ సంక్షోభం పెరిగిందని, రైతుల ఆత్మహత్యలు చేసుకుంటున్నాయని, ఈ తరుణంలో అమెరికా సుంకాల ఒప్పందాలను అంగీకరిస్తే తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని వివరించారు. సీనియర్ పాత్రికేయులు రాఘవశర్మ, సీపీఎం జిల్లా కార్యదర్శి వి.నాగరాజు, కార్యదర్శి వర్గ సభ్యులు కందారపు మురళి మాట్లాడుతూ ట్రంప్ నిర్ణయాలను బీజేపీ మంత్రి సమర్థించడం శోచనీయమన్నారు. స్విమ్స్ ఆస్పత్రికి టీటీడీ రూ.100 కోట్లు మంజూరు చేస్తే అడ్డుకోవడం, ఈ ఆస్పత్రిలో ముస్లింలు, క్రైస్తవులు ఉండరాదని బీజేపీ చెప్పడం శోచనీయమన్నారు. లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని మే 20వ తేదీన చేపట్టనున్న సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. సదస్సులో సీపీఎం నేతలు పుల్లయ్య, జనార్దన్, వెంకటయ్య, సాయిలక్ష్మి, సుబ్రమణ్యం, వేణుగోపాల్ ప్రసంగించారు.

పలువురికి ఉగాది పురస్కారాలు ప్రదానం


తిప్పారెడ్డిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే ఆరణి, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం

తిరుపతి(కల్చరల్), ఏప్రిల్26(ఆంధ్రజ్యోతి): సిటీ ఛాంబర్ కార్యక్రమాలు స్వచ్ఛంద సంస్థలకు ఆదర్శమని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. మహతి ఆడిటోరియంలో సిటీ ఛాంబర్ ఆధ్వర్యంలో ఆదివారం ఉగాది పురస్కారాల కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఢిల్లీ నుంచి గల్లీ వరకు వివిధ రంగాల్లో విశిష్ట సేవలు చేసిన వారిని గుర్తించి 28 సంవత్సరాలుగా ఉగాది పురస్కారాలు అందిస్తున్న సిటీ ఛాంబర్‌ను అభినందించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ సిటీ ఛాంబర్ ఆధ్వర్యంలో 400కు పైగా వైద్య శిబిరాలు నిర్వహించామని తెలిపారు. రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, మాజీ మంత్రి పరసారత్నం, మాజీ ఎమ్మెల్యేలు మోహన్, సుగుణమ్మ, టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు పోకల అశోక్ కుమార్, సిటీ ఛాంబర్ అధ్యక్షుడు ఆయుబ్‌ఖాన్, కార్యదర్శి షణ్ముగం యాదవ్, చైర్మన్ కేఎస్ వాసు, ఉపాధ్యక్షులు ప్రొఫెసర్ స్టాన్లీ జయకుమార్, డాక్టర్ కరుణానిధి, పీసీ స్వామి, స్వరాజ్యలక్ష్మి, వేణు తదితరులు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతలు..: సీనియర్ రాజకీయ నేత మందలపు మోహన్‌రావుకు జీవిత సాఫల్య పురస్కారం, చార్టర్డ్ అకౌంటెంట్ ఎంఆర్ఎస్ శ్రీనివాస్, కార్పొరేటర్ అన్నా అనితా యాదవ్, డాక్టర్ సి.అర్చన, ఎల్.వెంకటరమణ, డాక్టర్ పి.గోపాల్, సాంభోలు హరినాథ్, ఎస్.సరళకు ఉగాది పురస్కారం, ఈ.పద్మజకు ప్రత్యేక గౌరవ పురస్కారం ప్రదానం చేశారు.

తిప్పారెడ్డికి లైఫ్ టైం అచీవ్‌మెంట్ అవార్డు

తిరుపతి రూరల్, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): తిరుపతికి చెందిన అంబేడ్కర్ గ్లోబల్ లా ఇన్‌స్టిట్యూట్ చైర్మన్ డాక్టర్ ఆర్. తిప్పారెడ్డిని తిరుపతి సిటీ చాంబర్ ఆధ్వర్యంలో ఆదివారం మహతి ఆడిటోరియంలో నిర్వహించిన సమావేశంలో లైఫ్ టైం అచీవ్‌మెంట్ పురస్కారంతో సత్కరించారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం, మాజీ ఎమ్మెల్యేలు సుగుణమ్మ, మోహన్, యాదవ్ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, మాజీ మంత్రి పరసారత్నం చేతుల మీదుగా అవార్డు అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో స్కూటరిస్టుకు గాయాలు


రోడ్డు ప్రమాదంలో గాయపడిన శంకర్ రెడ్డి

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం తనపల్లి క్రాస్ వద్ద ఆదివారం తెల్లవారు ఝామున జరిగిన రోడ్డు ప్రమాదంలో స్కూటరిస్టు గాయపడ్డాడు. సీఐ చిన్నగోవిందు వివరాల మేరకు.. ఎమ్మార్‌పల్లి సర్కిల్‌కు చెందిన గొట్టు శంకర్ రెడ్డి ట్రావెల్స్ నడుపుతున్నాడు. తిరుచానూరు నుంచి వస్తూ తనపల్లి క్రాస్ వద్ద రోడ్డు క్రాస్ చేస్తుండగా చంద్రగిరి నుంచి గూడూరు వైపు వెళుతున్న లారీ ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. శంకర్‌రెడ్డి తలకు, కాళ్లకు బలమైన గాయాలయ్యాయి. రుయాకు తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, లారీ డ్రైవర్ విజయేంద్రన్‌ను అదుపులోకి తీసుకున్నారు.

ద్విచక్ర వాహనాల ఢీ : ఒకరికి గాయాలు

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో ఒకరు గాయపడ్డారు. అలిపిరి ఎస్ఐ అజిత వివరాల మేరకు... ఖాదీకాలనీకి చెందిన వెంకటేశ్వర్లు స్థానికంగా చికెన్ షాపు నడుపుతున్నాడు. ఈనెల 21న అర్ధరాత్రి దుకాణం మూసుకుని స్కూటీపై ఇంటికి వెళుతుండగా మద్యం తాగి ద్విచక్ర వాహనంపై వస్తున్న అంబేడ్కర్ కాలనీకి చెందిన భరత్‌కుమార్ వేగంగా వచ్చి ఢీకొన్నాడు. ఈ ఘటనలో వెంకటేశ్వర్లుకు తీవ్ర గాయాలయ్యాయి. ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

తిరుమలలో తప్పిపోయిన బాలుడు

మల్లవరంలో గుర్తింపు


బాలుడితో రేణిగుంట పోలీసులు

రేణిగుంట, ఏప్రిల్ 27, (ఆంధ్రజ్యోతి): తిరుమలలో తప్పిపోయిన బాలుడిని మల్లవ రంలో స్థానికులు గుర్తించి అర్బన్ పోలీసులకు ఆదివారం అప్పజెప్పారు. కర్ణాటక రాష్ట్రం రాయచూరు జిల్లా లింగసుగురు తాలుకా ముద్గల్ గ్రామానికి చెందిన బాలుడు శ్రీనివాస్ కుటుంబ సభ్యులతో కలిసి తిరుమల శ్రీవారి దర్శనార్థం వచ్చాడు. అక్కడ తప్పిపోవడంతో తిరుమల టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో బాలుడి తండ్రి కిష్టప్ప ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదైంది. ఆ బాలుడు మల్లవరంలో సంచరిస్తుండగా స్థానికులు వివరాలు అడిగి తెలుసుకున్నారు. వెంటనే అర్బన్ పోలీసులకు సమాచారం అందించారు. వారు తిరుమల టూ టౌన్ పోలీసులకు సమాచారం చేరవేశారు. ఈక్రమంలో తిరుమల పోలీసులు కిష్టప్పకు సమాచారం అందించారు.

గుమస్తానే నగలు కాజేశాడు

అరెస్టు చేసిన పోలీసులు ● రూ.14 లక్షల చోరీ సొత్తు స్వాధీనం


పోలీసులు స్వాధీనం చేసుకున్న నగలు

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): బంగారు దుకాణంలో పని చేస్తూ, యజమానికి నమ్మకంగా ఉంటూ, నగలు, వెండి వస్తువులు కాజేసిన గుమస్తాను తిరుపతి క్రైం పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. అతడి నుంచి దాదాపు రూ.14 లక్షలు విలువ చేసే బంగారు నగలు, వెండి వస్తువులు స్వాధీనం చేసుకున్నారు. క్రైం డీఎస్పీ శ్యాంసుందర్ తెలిపిన ప్రకారం.. రామచంద్రాపురం మండలం రామాపురం గ్రామానికి చెందిన మేఘవర్మ చిన్నప్పటి నుంచి జులాయిగా తిరిగేవాడు. స్నేహితులతో కలసి చిన్న చిన్న దొంగతనాలు చేస్తూ జల్సాగా ఖర్చు పెట్టేవాడు. ఈ క్రమంలో తిరుపతిలోని ఎస్‌జే బంగారు దుకాణంలో గుమస్తాగా చేరాడు. నమ్మకంగా ఉంటూ వచ్చాడు. బంగారు దుకాణం యజమాని నటరాజన్ తన కుమారుడి వివాహ పనుల్లో బిజీగా ఉంటున్నారు. గుమస్తాకు బంగారు షాపును అప్పగించి వ్యాపారం చేసుకోమని చెప్పి వెళ్లారు. దీన్ని ఆసరాగా చేసుకున్న మేఘవర్మ.. దుకాణంలోని కొన్ని బంగారు నగలు, వెండి వస్తువులు కాజేశాడు. కుమారుడి వివాహం తర్వాత దుకాణానికి వచ్చిన నటరాజన్ అమ్మకం రికార్డులు పరిశీలించాలని చెప్పారు. దీంతో గుమస్తా మేఘవర్మ తన సెల్‌ఫోను స్విచ్ ఆఫ్ చేసుకుని పరారయ్యాడు. దీంతో షాపు యజమాని అమ్మకం రికార్డులు, ఉన్నవాటిని పరిశీలించగా దాదాపు 268 గ్రాముల బంగారు నగలు, 356 గ్రాముల వెండి వస్తువులు కనపడలేదని గుర్తించారు. దీనిపై క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీసీఎస్ అదనపు ఎస్పీ నాగభూషణరావు ఆధ్వర్యంలో డీఎస్పీ శ్యాంసుందర్, సీఐలు శివకుమార్, ప్రకాష్‌కుమార్, ఎస్ఐ ప్రదీప్‌కుమార్, సిబ్బంది బృందాలుగా ఏర్పడి అనుమానితుడిపై నిఘా పెట్టారు. విచారించారు. అలిపిరి- చెర్లోపల్లె రోడ్డులో ఆదివారం అనుమానాస్పద రీతిలో తిరుగుతున్న మేఘవర్మను పోలీసులు అరెస్టు చేశారు. అతడి నుంచి దాదాపు రూ.14 లక్షలు విలువ చేసే 271 గ్రాముల బంగారు నగలు, 356 గ్రాముల వెండి వస్తువులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో ప్రతిభ కనపరచిన డీఎస్పీ, సీఐలు, ఎస్ఐలు, కానిస్టేబుళ్లను ఎస్పీ హర్షవర్ధనరాజు అభినందించి రివార్డులు అందజేశారు.

నగరవనంలో స్వచ్ఛాంధ్ర


చెత్త తొలగిస్తున్న అటవీ అధికారులు

మంగళం, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): స్థానిక నగరవనంలో ఆదివారం అటవీ శాఖ ఆధ్వర్యంలో స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహించారు. మోహన్‌బాబు యూనివర్సిటీకి చెందిన ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు. పరిసర ప్రాంతాల్లో చెత్తను తొలగించారు. అనంతరం అటవీ శాఖ అధికారులు ఎన్ఎస్ఎస్ వలంటీర్లకు మొక్కలను అందజేశారు. పర్యావరణానికి హాని కలిగించకుండా మొక్కలను పెంచాలని కోరారు. కార్యక్రమంలో తిరుపతి, పనపాకం రేంజ్ ఆఫీసర్లు సుదర్శన్‌రెడ్డి, మాధవి, అటవీశాఖ సిబ్బంది, ప్రొటెక్షన్ వాచర్లు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో తిరుపతి యువకుల ప్రతిభ


మెడల్స్ స్వీకరిస్తున్న సూర్య, మిత్ర

తిరుపతి(క్రీడలు), ఏప్రిల్ 27: మలేసియా కౌలాలంపూర్‌లో మూడు రోజుల పాటు జరిగిన 14వ సైలెంట్ నైట్ కరాటే పోటీల్లో తిరుపతికి చెందిన ఎన్.సూర్య, బి.మిత్ర అసాధారణ ప్రతిభ కనబరిచారు. సూర్య మేల్ క్యాడెట్ టీం కుమితే విభాగంలో సిల్వర్, మేల్ వ్యక్తిగత కుమితే విభాగంలో బ్రాంజ్, మేల్ జూనియర్ టీం కటాలో బ్రాంజ్ మెడల్స్ సాధించాడు. మిత్ర మేల్ వ్యక్తిగత టీం కుమితేలో బ్రాంజ్ మెడల్ కైవసం చేసుకున్నాడు. వీరికి కరాటే ఇండియన్ ఆర్గనైజేషన్ జాయింట్ సెక్రటరీ, టీమిండియా హెడ్ కోచ్ షిహన్‌కీర్తన్ కొండూరు మెడల్స్, ప్రశంసాపత్రాలు అందజేశారు. కోచ్‌లు పి.నవీన్, పి.అనిల్‌ను అభినందించారు.

ఉగ్రదాడికి నిరసన ర్యాలీ

తిరుపతి అర్బన్, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): ఉగ్రదాడిని ఖండిస్తూ ఏపీ రోలర్ స్కేటింగ్ అసోసియేషన్, తిరుపతి, చిత్తూరు జిల్లాల స్కేటింగ్ అసోసియేషన్ సంయుక్తంగా ఆదివారం ర్యాలీ నిర్వహించాయి. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ర్యాలీని ప్రారంభించారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు పురుషోత్తం, హనుమాన్‌బాబ్జి, పి.ఎల్.ప్రసాద్, రాజేష్, శశికిరణ్, జనసేన నాయకులు లోకేశ్ పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం ఢీకొని ఒకరికి గాయాలు

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనం ఢీకొని వ్యక్తికి గాయాలైన ఘటన ఆదివారం స్థానిక అనంత లా కాలేజీ వద్ద చోటు చేసుకుంది. ఈస్ట్ ఎస్ఐ బాలకృష్ణ వివరాల మేరకు.. సాయినగర్‌కు చెందిన శేఖర్‌రెడ్డి తిరుపతిలోని డెయిరీలో పనిచేస్తున్నాడు. విధులు ముగించుకుని ఇంటికి వెళుతుండగా పుత్తూరుకు చెందిన స్టీఫెన్ బైక్‌లో తిరుపతికి వస్తూ శేఖర్‌రెడ్డిని ఢీకొట్టాడు. కాలికి గాయాలయ్యాయి. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

భక్తులతో కిటకిటలాడిన చెంగాళమ్మ ఆలయం



ఆలయ ప్రాంగణంలో భక్తులు

సూళ్లూరుపేట, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని చెంగాళమ్మ ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. అమావాస్య రోజు రాత్రి ఆలయంలో నిద్రిస్తే కోర్కెలు నెరవేరి మంచి జరుగుతుందని భక్తుల నమ్మకం. దీంతో తమిళనాడు నుంచి భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి అమ్మవారిని దర్శించుకొని ఆలయ ఆవరణలో నిద్రించారు. అదే విధంగా వేనాడు దర్గాకు భక్తులు అధిక సంఖ్యలో తరలివెళ్లారు.

2నుంచి వేసవి క్రికెట్ శిక్షణ శిబిరం



క్రికెట్ సబ్‌సెంటర్ ప్రతినిధులు, క్రీడాకారులు

గూడూరు అర్బన్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏపరెడ్డి ప్రభుత్వం స్టేడియంలోని క్రికెట్ సబ్‌సెంటర్‌లో మే 2వ తేదీ నుంచి జిల్లా క్రికెట్ అసోసియేషన్ సహకారంతో ఉచిత వేసవి క్రికెట్ శిక్షణ శిబిరాన్ని ప్రారంభించనున్నట్లు సబ్‌సెంటర్ ఇన్‌చార్జి మునిగిరీస్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఏటా ఉచిత వేసవి శిక్షణ శిబిరాన్ని నిర్వహించి యువ క్రీడాకారులకు శిక్షణ అందిస్తున్నామన్నారు. క్రికెట్‌లో కోచ్ ద్వారా నైపుణ్యాలను పెంపొందించేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. నెలరోజుల పాటు నిర్వహించే ఈ శిబిరంలో 7నుంచి 16 సంవత్సరాల లోపు వాళ్లు పాల్గొన వచ్చునన్నారు. కార్యక్రమంలో మస్తాన్, అనిల్‌కుమార్, సురేంద్రరెడ్డి, లవ కుమార్, నాగేశ్వరరావు, రజిని, సుబ్రహ్మణ్యం, విజయ్‌కుమార్, నూర్‌మహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా ద్రౌపదీ కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

తడ, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వాటంబేడుకుప్పం గ్రామంలో జరుగుతున్న పంచపాండవ ద్రౌపదీ సమేత ధర్మరాజుస్వామి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం కల్యాణోత్సవం నిర్వహించారు. ముందుగా ద్రౌపది, అర్జునుల కల్యాణం జరిపించారు. అనంతరం మిగిలిన పాండవులతో కల్యాణాన్ని వేదపండితులు శాస్త్రోపేతంగా నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి కల్యాణాన్ని తిలకించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. రాత్రి ద్రౌపది సమేత పంచపాండవుల గ్రామోత్సవం జరిగింది. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా చెన్నై శక్తి ఈవెంట్, ఎంఎస్ ఈవెంట్ ఆధ్వర్యంలో పాట కచ్చేరి, హాస్యవల్లరిని నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ నిర్వాహకులు బొమ్మన ఫణి, శ్రీధర్, జయరామయ్య, ధనుంజయ తదితరులు పర్యవేక్షించారు.

విద్యార్థినికి అభినందన



ఇంద్రజను సత్కరిస్తున్న డాక్టర్ శేఖర్, హెచ్‌ఎం సంపూర్ణమ్మ, భాస్కర్

డక్కిలి, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): పదో తరగతి ఫలితాల్లో జిల్లా టాపర్‌గా నిలిచిన డక్కిలి మండలం చాపలపల్లి గ్రామానికి చెందిన కలపాటి మోహన్, వరమ్మ దంపతుల కుమార్తె ఇంద్రజకు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం ఝాన్సీ జిల్లా సీనియర్ సూపరింటెండెంట్ బీటీజీటీఎస్ మూర్తి తన చిన్నాన్న బత్తల భాస్కర్ ద్వారా ఇంద్రజకు రూ.5000 నగదు అందజేశారు. ఫోన్‌లో ఇంద్రజను అభినందించారు. అలాగే ప్రభుత్వ వైద్యుడు కలపాటి శేఖర్, చెన్నసముద్రం ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎం సంపూర్ణమ్మ విద్యార్థిని ఇంద్రజను శాలువ కప్పి సత్కరించారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు కలపాటి సుందరయ్య, నథనియల్, సుబ్బారావు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కోట - తిరుపతి ఆర్టీసీ సర్వీస్ ప్రారంభం



ఆర్టీసీ సర్వీస్‌ను ప్రారంభిస్తున్న ఆర్‌ఎం నరసింహులు, టీడీపీ మండల అధ్యక్షుడు గణపర్తి కిషోర్ నాయుడు

చిట్టమూరు, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): కోట నుంచి వాకాడు, చిట్టమూరు మీదుగా తిరుపతికి ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ సర్వీస్‌ను ఆదివారం చిట్టమూరు ఆర్టీసీ బస్టాండ్ వద్ద తిరుపతి ఆర్‌ఎం నరసింహులు, టీడీపీ మండల అధ్యక్షుడు గణపర్తి కిషోర్ నాయుడు ప్రారంభించారు. ఈ సర్వీస్ కోటలో ప్రతిరోజూ ఉదయం 6, మధ్యాహ్నం 12గంటలకు, అలాగే తిరుపతిలో ఉదయం 9, సాయంత్రం 6 గంటలకు బయలుదేరుతుంది. కార్యక్రమంలో వాకాడు డిపో మేనేజర్ పెంచలయ్య, ఎంపీడీవో మనోహర్ గౌడ్, ఎస్ఐ చిన్న బలరామయ్య, మెకానికల్ ఇంజనీర్ నారాయణ, సూపర్‌వైజర్ రఘురామయ్య, టీడీపీ నాయకులు బాబు నాయుడు, జనార్దనరెడ్డి, రాజేష్‌రెడ్డి, చిన్నారావు, కండక్టర్ నరసింహులు, డ్రైవర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు నిత్యావసరాల పంపిణీ

గూడూరు అర్బన్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక డీఎస్‌ఆర్ కమ్యూనిటీ హాలులో ఆదివారం సింహపురిరెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పేదలకు నిత్యావసరాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో విజయ్‌భాస్కర్‌రెడ్డి, ప్రజేంద్రరెడ్డి, శ్రీనివాసులురెడ్డి, కృష్ణారెడ్డి, జయపాల్‌రెడ్డి పాల్గొన్నారు.



నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నాయుడుపేట టౌన్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): తుమ్మూరులోని 33/11 కేవీ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా సోమవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని పట్టణ ఏఈ శివశంకర్ తెలిపారు. నాయుడుపేట పట్టణంలోని సీఎస్‌తేజ సెంటర్, మంగపత్తి నాయుడు నగర్, కుమ్మరవీధి, బేరిపేట, ఆర్ముగంనగర్, రజకకాలనీ, మార్కెట్ వీధి, శివాలయం వీధి, చిన్నదర్గారోడ్డు, బ్రాహ్మణవీధి, గిండివారితోట, బజారువీధి, గరిడివీధి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని, వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

నేటి నుంచి టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలకు శిక్షణ

నాయుడుపేట, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షల్లో ఫెయిలై, సప్లిమెంటరీ పరీక్షలు రాసే విద్యార్థులకు సోమవారం నుంచి నాయుడుపేటలోని బాలుర ఉన్నత పాఠశాలలో శిక్షణ తరగతులను నిర్వహించనున్నట్లు ఎంఈవో మునిరత్నం తెలిపారు. ఆయా సబ్జెక్టుల్లో సుశిక్షితులైన ఉపాధ్యాయులచే శిక్షణ ఇవ్వబడుతుందని, మండలంలోని అన్ని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగ పరచుకోవాలన్నారు.

దేనికీ వినియోగించుకోలేరా?

పదేళ్లుగా ఖాళీగా ఉన్న బాలికల వసతిగృహం



విన్నమాలలోని బాలికల వసతి గృహ భవనం

నాయుడుపేట, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట పట్టణ సమీపంలోని విన్నమాల గ్రామంలో నిర్మించిన బాలికల వసతి గృహం పదేళ్లుగా ఖాళీగా ఉంది. పట్టణంలోని ఎల్‌ఏ సాగరంలో డిగ్రీ కళాశాల, తుమ్మూరులో జూనియర్ కళాశాల ఉన్నాయి. వీటిల్లో చదువుకునే బాలికల కోసం పట్టణ సమీపంలోని విన్నమాల గ్రామంలో రూ.2.5 కోట్లతో వసతి గృహాన్ని నిర్మించి 2015 ఆగస్టు 5న ప్రారంభించారు. డిగ్రీ కళాశాలకు ఐదు కిలోమీటర్లు, జూనియర్ కళాశాలకు మూడు కిలోమీటర్ల దూరంలో వసతి గృహం ఉండడంతో అందులో చేరేందుకు బాలికలు ఎవరూ ముందుకు రాలేదు. దీంతో అప్పటి ఉమ్మడి నెల్లూరు జిల్లా జానకి చొరవ తీసుకుని కళాశాల విద్యార్థులకు ఐఐటీ, జేఈఈ అడ్వాన్స్‌డ్ మెయిన్స్ కోసం ఈ భవనంలో శిక్షణ తరగతులు ప్రారంభించారు. శిక్షణ పొందే విద్యార్థులకు అక్కడే వసతితో పాటు భోజన సదుపాయం కల్పించారు. తరువాత ఆమె బదిలీపై వెళ్లిపోవడంతో ఈ భవనంలో ఎటువంటి కార్యకలాపాలు లేక నిరుపయోగంగా ఉంది. ఇదిలా ఉండగా, పట్టణంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఇరుకుగా వున్న అద్దె భవనంలో నిర్వహిస్తుండటంతో రిజిస్ట్రేషన్ల కోసం వచ్చేవారు నిల్చునేందుకు కూడా స్థలం సరిపోవడంలేదు. అలాగే నాయుడుపేట పంచాయతీగా ఉన్నప్పుడు నిర్మించిన పాత భవనంలోనే నేడు మున్సిపాలిటీ కార్యాలయం ఉంది. మున్సిపల్ అధికారులు, సిబ్బంది విధులు నిర్వహించడానికి ఆ భవనం సరిపోక ఇబ్బందులు పడుతున్నారు. ఇక ఆర్‌అండ్‌బీ కార్యాలయ భవనం శిథిలావస్థకు చేరుకుంది. ఈ కార్యాలయాలను వసతిగృహంలోకి తరలించినా ప్రజలకు సౌకర్యంగా ఉంటుంది. అయితే ఎందుకనో అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోలేదు. ఫలితంగా రూ.2.5 కోట్లతో నిర్మించిన భవనం పదేళ్లుగా నిరుపయోగంగా ఉంది.

కోనోకార్పస్ మొక్కలను రక్షించండి

పర్యావరణవేత్త ప్రొఫెసర్ బయ్యపురెడ్డి



తిరుపతి(లీలామహల్), ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల్లో కోనోకార్పస్ మొక్కపై నిరాధార నిందలు ఆపి ఎన్నో ప్రయోజనాల గల కోనోకార్పస్ మొక్కను రక్షించాలని పర్యావరణవేత్త, ఆచార్య నాగార్జున యూనివర్సిటీ పూర్వ వృక్షశాస్త్ర ప్రొఫెసర్ కె.బయ్యపురెడ్డి కోరారు. జనచైతన్య వేదిక ఆధ్వర్యంలో ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో జరిగిన ముఖాముఖి కార్యక్రమానికి జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి, ప్రముఖ ఆడిటర్ పల్లుణ కుమార్, ఎస్వీ యూనివర్సిటీ జియాలజీ ప్రొఫెసర్ టి.వి.కృష్ణారెడ్డి, ఆల్ ఇండియా నేషనల్ బీసీ ఫ్రంట్ కన్వీనర్ కెఎంఎల్.నరసింహులు హాజరయ్యారు. బయ్యపురెడ్డి మాట్లాడుతూ కోనో కార్పస్ మొక్క మొదట యమన్ దేశంలో సహజసిద్ధంగా పెరిగి క్రమేణా ప్రపంచవ్యాప్తంగా విస్తరించిందన్నారు. దుబాయ్, కువైట్, అబుదాబి వంటి గల్ఫ్ దేశాల్లో నీరు లభించకపోయినా 70 శాతానికి పైగా పచ్చదనాన్ని అందిస్తున్నాయన్నారు. ఈ మొక్కలు కార్బన్ డైఆక్సైడ్‌ను అత్యధికంగా తీసుకుని అత్యధిక ఆక్సిజన్‌ను అందిస్తాయని తెలిపారు. ఇవి అన్ని రకాల నేలల్లో పెరుగుతాయని, కలుషిత నీటిని, భూమిని కాపాడడమేకాక, వాయు, ధ్వని కాలుష్యం నుంచి ప్రజలను రక్షిస్తాయని వివరించారు. నిర్వహణ వ్యయం అవసరం లేదన్నారు. విదేశీ మొక్క అనే విమర్శను ఖండిస్తున్నానని, టమోటా, ఆలుగడ్డలు, మిర్చి, కాఫీ, టీ, మిర్చి లాంటివి కూడా విదేశీ మొక్కలేనని గుర్తుచేశారు. అలర్జీ, ఆస్తమా లాంటి సమస్యలు వ్యక్తిగతమైనవని తెలుపుతూ బెంగళూరులోని అంతర్జాతీయ విద్యా సంస్థల్లో వేలాది కోనోకార్పస్ మొక్కలతో నిండి ఉన్నాయని, ఏ ఒక్క విద్యార్థికీ ఆస్తమా, అలర్జీ సమస్య రాలేదన్నారు. ప్రపంచంలో సగటున ఒక్కొక్క మనిషికి 422 చెట్లు ఉండగా బ్రెజిల్‌లో 1,500, అమెరికాలో 720, కెనడాలో 318, చైనాలో 140 చెట్లు ఉండగా భారత్‌తో మాత్రం కేవలం 28 మాత్రమే ఉన్నాయని వివరించారు. బహుళ ప్రయోజనాలు అందించే కోనోకార్పస్ మొక్కలను రక్షించడానికి రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, వృక్ష ప్రేమికులు కృషి చేయాలని కోరారు. కోనోకార్పస్ మొక్కలపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఆకట్టుకుంది.

ఉగ్రవాదుల దిష్టిబొమ్మ దహనం

వెంకటగిరి, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): కశ్మీర్‌లోని పహల్గాంలో హిందూ పర్యాటకులపై మారణకాండకు పాల్పడిన ఉగ్రవాదుల దుశ్చర్యను నిరసిస్తూ పట్టణంలోని కాశీపేట కూడలిలో ఆదివారం కవచ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఉగ్రవాదుల దిష్టిబొమ్మను దహనం చేశారు. అంతకుముందు కాశీపేట కూడలిలో ఉన్న నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో విష్ణుమోహన్, రవి, మణి, వెంకీ, బాషా, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మకు పూజలు

చిల్లకూరు, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని తూర్పు కనుపూరు గ్రామంలో వెలసిన ముత్యాలమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. భక్తులు ఆలయం వద్ద పొంగళ్లు పెట్టి నైవేద్యం నివేదించి ముత్యాలమ్మను దర్శించుకున్నారు. ఆలయం ఎదుట ఉన్న త్రిశూలం వద్ద టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు.

టీడీపీ నేత కుటుంబానికి పరామర్శ

చిల్లకూరు, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మనగారిపాళెం గ్రామానికి చెందిన టీడీపీ రాష్ట్ర ఎస్టీసెల్ కార్యదర్శి కుడుమల గోపాల్ ఇటీవల మృతి చెందారు. ఆదివారం టీడీపీ ఎస్టీసెల్ రాష్ట్ర అధ్యక్షుడు దారునాయక్ తిమ్మనగారిపాళెం చేరుకుని గోపాల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.

రైతులకు అన్యాయం చేయొద్దు

కోట, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): రైతులు సాగు చేసిన వేరుశనగ పంటలను అధికారులు తొలగించడం సరికాదని వైసీపీ రాష్ట్ర కార్యదర్శి పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన కోట మండలం కొత్తపట్నం పంచాయతీ శ్రీనివాససత్రంలో వేరుశనగ పంటలను రైతులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెన్నై, బెంగళూరు కోస్టల్ కారిడార్‌కు తీసుకున్న భూముల్లో సాగు చేసిన వేరుశనగ పంటను అధికారులు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా ధ్వంసం చేయడం అన్యాయమన్నారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు పాదర్తి రాధకృష్ణారెడ్డి, ఉప్పల ప్రసాద్‌గౌడ్, దువ్వూరు సాయికృష్ణారెడ్డి, దువ్వూరు శ్రీనివాసులురెడ్డి, వెంకటాద్రి, సర్పంచు తిరుపాలయ్య తదితరులు పాల్గొన్నారు.

పహల్గాం మృతులకు నివాళి

కోట, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గూడలి తిప్పపై వెలసిన పర్వత వర్ధిణీ సమేత భీమేశ్వరాలయంలో ఆదివారం పహల్గాం మృతులకు గ్రామస్తులు నివాళులర్పించారు. గూడలితిప్పపై శాంతి దీపాన్ని వెలిగించి ఆత్మశాంతి చేకూరాలని ప్రార్థించారు. ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలంటూ నినాదాలు చేశారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



వాకాడు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): చేపల వేట నిషేధ సమయంలో మత్స్యకారుల భృతి రూ.20వేలకు పెంచి ఇవ్వడం పట్ల మత్స్యకారులు హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం వైట్‌కుప్పం గ్రామం లో మత్స్యకారుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మామిడి గోవిందయ్య ఆధ్వర్యంలో సీఎం చంద్రబాబునాయుడు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కేక్ కట్‌చేసి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో బాబు, వెంకటేశ్వర్లు, తిరుమల తదితరులు పాల్గొన్నారు.

వేసవి శిక్షణ తరగతులు

వెంకటగిరి టౌన్, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గ్రంథాలయంలో సోమవారం నుంచి జూన్ 6వ తేదీ వరకు వేసవి శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు గ్రంథాలయాధికారి అంజయ్య తెలిపారు. కథలు, స్పోకెన్ ఇంగ్లీష్, కెరీర్ గైడెన్స్, జనరల్ నాలెడ్జి, యోగా, డ్రాయింగ్ తదితర అంశాల్లో శిక్షణ తరగతులు ఉంటాయన్నారు.

చోరీల పట్ల అప్రమత్తంగా ఉండాలి

గూడూరు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): చోరీల పట్ల ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలని రెండో పట్టణ సీఐ శ్రీనివాస్ అన్నారు. ఆదివారం స్థానిక రెండో పట్టణ పరిధిలో దొంగతనాల నియంత్రణపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి కావడంతో మిద్దెపై నిద్రించేవారు ఇంటి తాళాలను సక్రమంగా వేసుకోవడంతో పాటు జాగ్రత్తలు పాటించాలన్నారు. సుదూర ప్రాంతాలకు వెళ్లే సమయంలో ఇంటిలోని బంగారు ఆభరణాలను, నగదును సురక్షితంగా భద్రపరుచుకుని ఇరుగుపొరుగు వారికి సమాచారం ఇవ్వాలన్నారు.

ఇంట్లో చోరీ

గూడూరు అర్బన్, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): స్థానిక రెండోపట్టణ పరిధిలోని చింపిరినాయుడుకట్ట ప్రాంతంలో ఓ ఇంట్లో చోరీ జరగడంతో ఆదివారం బాధితురాలు రెండో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. రెండో పట్టణ పోలీసుల వివరాల మేరకు... స్థానిక చింపిరి నాయుడుకట్ట ప్రాంతానికి చెందిన నాగమణి శనివారం రాత్రి తన ఇంటికి తాళం వేసుకుని సమీపంలోని బంధువుల ఇంటికి వెళ్లింది. ఆదివారం ఉదయం వచ్చి చూసే సరికి ఇంటి తాళాలు పగలగొట్టి ఉన్నాయి. లోనికి వెళ్లి చూడగా బీరువాను పగలగొట్టి, అందులో ఉన్న 3 సవర్ల బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్న రెండో పట్టణ సీఐ శ్రీనివాస్ తెలిపారు.

దుకాణంలో ....

వాకాడు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): వాకాడు అశోక్ పిల్లర్ ప్రాంతంలోని ఓ చిల్లర దుకాణంలో శనివారం అర్ధరాత్రి చోరీ జరిగింది. బాధితురాలు చింతల రమణమ్మ తెలిపిన వివరాల మేరకు... శనివారం 9 గంటలకు దుకాణానికి తాళం వేసి ఇంటికి వెళ్లారు. ఆదివారం ఉదయం దుకాణం తెరిచేందుకు వెళ్లగా షటర్ తాళాలు పగలగొట్టి ఉన్నాయి. దుకాణంలో ఉంచిన రూ.10వేలు కనిపించకపోవడంతో బాధితురాలు ఎస్ఐ నాగబాబుకు ఫిర్యాదు చేశారు.

వైద్య ఖర్చులకు ఆర్థిక సాయం



కోట, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): కోట దళితవాడకు చెందిన యర్రమతి వెంకటేశ్వర్లు కుమార్తె అరుణ జ్యోతి అనారోగ్యంతో బాధపడుతుండడంతో వైద్య ఖర్చుల కోసం టీడీపీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు షేక్ జలీల్ అహ్మద్ రూ.10వేలు అందజేశారు. అలాగే ఎంపీటీసీ దారా సురేష్ రూ.5 వేలు అందజేశారు.

కోటమ్మకు పూజలు

కోట, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): కోట గ్రామదేవత కోటమ్మకు ఆదివారం విశేష పూజలు జరిగాయి. ఈ సందర్భంగా అమ్మవారికి పండితులు పలు అభిషేకాలు చేసి చందన, పుష్పాలంకరణలో ఉంచారు. కోట, వాకాడు, చిట్టమూరు, చిల్లకూరు మండలాలకు చెందిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆయా ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు పాలకమండలి ఆధ్వర్యంలో తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

నూతన ఆలోచనలతో ముందుకెళ్లాలి



విద్యార్థులకు ఉద్యోగ నియామక పత్రాలు అందజేస్తున్న అమిత్ కటారియా, విద్యాసంస్థల చైర్మన్ వంకి పెంచలయ్య

గూడూరు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): క్యాంపస్ సెలక్షన్స్‌లో ఉద్యోగాలు పొందినవారు నూతన ఆలోచనలతో ముందుకు వెళుతూ భవిష్యత్తులో వచ్చే సవాళ్లను ఎదుర్కొని రాణించాలని సారస్ సంస్థ సీఈవో అమిత్ కటారియా అన్నారు. ఆదివారం స్థానిక ఆదిశంకర ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన క్యాంపస్ సెలక్షన్స్ విజయోత్సవ కార్యక్రమంలో ఉద్యోగాలు పొందిన విద్యార్థులను అభినందించి వారికి నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా పోటీ ఎక్కువగా ఉందని, వినూత్న ఆలోచనలతో ముందుకు వెళ్లాలన్నారు. విద్యాసంస్థల చైర్మన్ వంకి పెంచలయ్య మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులకు విలువలతో కూడిన ఉన్నత విద్యను అందించడంతో పాటు వారికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. ఈ విద్యా సంవత్సరంలో తమ కళాశాలకు చెందిన 669 మంది విద్యార్థులు పలు కంపెనీల్లో ఉద్యోగాలు సాధించడం తమకెంతో గర్వకారణంగా ఉందన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ చైర్ పర్సన్ వంకి అనూషా, డైరెక్టర్ రాజామురుగదాస్, శ్రీనివాస్, వేణుమాధవ్, రాజయ్య, ధనుంజయ, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు



పోలీసులకు సూచనలిస్తున్న డీఎస్పీ గీతాకుమారి

గూడూరు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): ఎవరైనా నేరాలకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు చేపట్టడం జరుగుతుందని డీఎస్పీ గీతాకుమారి అన్నారు. ఆదివారం స్థానిక తిలక్‌నగర్‌లో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎవరైనా అనుమానితులు సంచరిస్తుంటే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కల్పించేలా వ్యవహరిస్తే కఠిన చర్యలు చేపడతామన్నారు. వాహనదారులు సరైన ధృవీ కరణ పత్రాలను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. మత్తు పదార్థాలను విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐ శ్రీనివాస్, ఎస్‌ఐలు మనోజ్‌కుమార్, సుబ్రహ్మణ్యంరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

అల్లంపాడు - నెల్లూరు సర్వీస్ ప్రారంభం



అల్లంపాడు బస్ సర్వీస్‌ను ప్రారంభిస్తున్న డీఎం చినపెంచలయ్య

కోట, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అల్లంపాడు నుంచి నెల్లూరుకు నూతన బస్ సర్వీస్‌ను వాకాడు డిపో మేనేజరు చినపెంచలయ్య ఆదివారం ప్రారంభించారు. గతంలో ఆదాయం లేని కారణంగా ఈ బస్ సర్వీస్‌ను డిపో అధికారులు రద్దు చేశారు. గ్రామస్తుల అభ్యర్థన మేరకు డీఎం స్పందించి కొత్త బస్సు సర్వీసును ప్రారంభించారు. కోట నుంచి అల్లంపాడు మీదుగా నెల్లూరుకు బస్ సర్వీసు నడుస్తుందని, ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డిపో అధికారులు రఘురామయ్య, తదితరులు పాల్గొన్నారు.

వధూవరులకు ఎమ్మెల్యే ఆశీర్వాదం



వధూవరులను ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ, పార్థసారథి

పెళ్లకూరు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతపూడి పంచాయతీ యాలకారికండ్రిగకు చెందిన టీడీపీ నాయకుడు వేణుంబాక మునిరామయ్య సోదరుడు హరికృష్ణ, లక్ష్మి వివాహం ఇటీవల జరిగింది. ఆదివారం యాలకారికండ్రిగలో జరిగిన రిసెప్షన్‌కు సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ, ఆమె భర్త పార్థసారధి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.

విద్యార్థినులకు అభినందన

గూడూరు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి ఫలితాల్లో ప్రతిభచాటిన ప్రభుత్వ పాఠశాలల బలిజ విద్యార్థినులను బలిజ మహిళా సంక్షేమ సంఘం సభ్యులు అభినందించారు. పలువురు విద్యార్థినులకు నగదు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఆదివారం జరిగిన ఈ కార్యక్రమంలో మహిళా సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షురాలు సారంగం సులక్ష్మి, సారంగం శ్రీనివాసులు, పద్మావతి, సువర్ణలక్ష్మి, అరుణ, ఉషా తదితరులు పాల్గొన్నారు.

డీసీసీబీలో విచారణ పూర్తి

వచ్చే నెల 15 తర్వాత ప్రభుత్వానికి నివేదిక

చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ)లో గత పాలకవర్గం చేసిన ఆర్థిక విధ్వంసంపై కొనసాగుతున్న సహకార చట్టం సెక్షన్ 51 విచారణ శుక్రవారంతో ముగిసింది. దీనిపై వచ్చేనెల 15 తర్వాత ప్రభుత్వానికి సమగ్ర నివేదిక కలెక్టర్ పేరిట పంపనున్నట్లు తాజాగా తెలిసింది. ఐదేళ్ల వైసీపీ పాలనలో అప్పటి బ్యాంకు చైర్‌పర్సన్‌గా ఎం.రెడ్డమ్మ కొనసాగగా, ఆరుగురు సింగిల్ విండో అధ్యక్షులు డైరెక్టర్లుగా పనిచేశారు. అప్పట్లో జరిగిన అవినీతి అక్రమాలపై 'ఆంధ్రజ్యోతి'లో గత ఏడాది జూన్ 11, 12, నవంబరు 13వ తేదీల్లో కథనాలు ప్రచురితమైన విషయం పాఠకులకు తెలిసిందే. మరోవైపు మాజీ ఎమ్మెల్సీ దొరబాబు గత పాలకవర్గం తప్పిదాలపై సీఎం చంద్రబాబుకు ఫిర్యాదు చేశారు. దాంతో విచారణకు ఆదేశిస్తూ కలెక్టర్ సుమిత్ కుమార్‌కు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ క్రమంలో డీఆర్వో మోహన్‌కుమార్‌ను విచారణ అధికారిగా కలెక్టర్ నియమించారు. ఆయన ఈ ఏడాది మార్చి 21 నుంచి ఈనెల 25వ తేదీ వరకు బ్యాంకు ప్రధాన కార్యాలయంలో విచారణ చేపట్టారు. ఈ వ్యవహారంపై 80 మందికి సమన్లు జారీచేశారు. విచారణకు బ్యాంకు మాజీ చైర్‌పర్సన్ ఎం.రెడ్డెమ్మ, ఆమె భర్త కృష్ణమూర్తి, మాజీ డైరెక్టర్లు బి.కరుణాకర్ చౌదరి, డి.హరినాథ రెడ్డి, టి.ఈరప్ప, షేక్ మస్తాన్ సాహెబ్, ఎం.బాలసుబ్రహ్మణ్యం, జి.అరుణమ్మ, చైర్‌పర్సన్ అప్పటి పీఏ సుధాకర్, అప్పటి బ్యాంకు సీఈవో మనోహర్ గౌడ్, జీఎం లిల్లీ కేథరిన్, వివిధ బ్యాంకు బ్రాంచ్ మేనేజర్లు, సింగిల్‌విండో సీఈవోలు విచారణకు హాజరై తమపై వచ్చిన అభియోగాలకు వివరణలు ఇచ్చారు. వరదయ్యపాళెం సింగిల్‌విండో పరిధిలో 17 స్వయం సహాయక సంఘాల పేరిట వైసీపీ నాయకులు, కార్యకర్తలు.. బినామీ రూపంలో 2020-22 మధ్య రూ.1.30 కోట్ల రుణాలు పొందారు. అందరూ రూ.9లక్షలు చెల్లించగా, మిగతా పైకం వడ్డీతో కట్టాల్సి ఉంది. ఇప్పటి వరకు ఇందుకు సంబంధించి 80మంది డ్వాక్రా సంఘం సభ్యులు విచారణకు హాజరవగా, మరో 90 మందిని మే ఒకటో తేదీన వరదయ్యపాళెంకు వెళ్లి డీఆర్వో విచారణ చేయనున్నట్లు సమాచారం.

శిథిల ఆలయం.. గోపురాలను కాపాడాలి



రామగిరి ఆలయం గురించి వివరిస్తున్న శివనాగిరెడ్డి

తిరుపతి(కల్చరల్), ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): పిచ్చాటూరు మండలం రామగిరిలో వెయ్యేళ్ల నాటి శిథిల ఆలయం, గోపురాలను కాపాడుకోవాలని పురావస్తు పరిశోధకుడు, ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ సీఈవో డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి అన్నారు. గ్రామాల్లో వారసత్వ సంపద పరిరక్షణ అవగాహనలో భాగంగా ఆదివారం ఆయన రామగిరిని సందర్శించారు. వాలీశ్వర, కాలభైరవ ఆలయాలను పరిశీలించారు. పల్లవుల కాలంలో నిర్మించి, చోళులు, విజయనగర రాజుల కాలంలో విస్తృతమైన ఆలయాలు, గోపురం రూపు కోల్పోతున్నాయన్నారు. అద్భుత వాస్తు శిల్పాలు కనుమరుగయ్యే ప్రమాదం ఉందన్నారు. చారిత్రక ప్రాధాన్యత కలిగిన ఈ ఆలయాలను, శిల్పాలను కాపాడి భవిష్యత్తు తరాలకు అందించాలని గ్రామస్తులను కోరారు. కార్యక్రమంలో ఎస్వీ మ్యూజియం అధికారులు చల్లా శివకుమార్, హరిప్రసాదరెడ్డి, శ్రీకాంత్, చరిత్ర పరిశోధకుడు పాములపాటి శ్రీనాథ్ రెడ్డి పాల్గొన్నారు.

రామగిరి అంకాళమ్మ ఆలయంలో అమావాస్య పూజలు



విశేష అలంకరణలో అమ్మవారు

పిచ్చాటూరు, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని రామగిరిలో కొలువై ఉన్న అంకాళ పరమేశ్వరి ఆలయంలో ఆదివారం రాత్రి అమావాస్య పూజలు అత్యంత వైభవంగా జరిగాయి. ఇందులో భాగంగా సాయంత్రం 7 గంటలకు అమ్మవారి మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అమ్మవారిని సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అనంతరం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఊంజల్ మండపానికి వేంచేపు చేసి ఉయ్యాలపై అధిష్ఠింపజేశారు. ఉగ్రరూపిణిగా అలంకరించి ఊంజల్ సేవ నిర్వహించారు. అర్ధరాత్రి 12 గంటల వరకు భక్తులు అమ్మవారి భజన పాటలతో నాట్యం చేస్తూ తన్మయత్వం పొందారు. అంతకు ముందు అన్నదానం జరిగింది. రామగిరితో పాటు చుట్టు పక్కల గ్రామాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేపట్టారు

ముస్లింల శాంతియుత ర్యాలీ



వరదయ్యపాళెం, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): జమ్మూ కశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రదాడికి నిరసనగా ఆదివారం వరదయ్యపాళెం పట్టణంలో బాధిత కుటుంబాలకు సంఘీభావంగా ముస్లిం, మైనార్టీలు, మత గురువులు కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పర్యాటకులను చంపడం హేయమైన చర్యగా అభివర్ణించారు. ఉగ్రవాదులను కేంద్రప్రభుత్వం కఠినంగా శిక్షించాలని కోరారు. అనంతరం బస్టాండు సమీపంలోని మసీదు ఆవరణలో మృతులకు నివాళులర్పించారు.

బృందమ్మ కాలనీలో పల్లె నిద్ర



శ్రీకాళహస్తి, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బృందమ్మ కాలనీలో 1టౌన్ సీఐ గోపి ఆధ్వర్యంలో పల్లె నిద్ర కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కొత్త చట్టాలు, సైబర్ క్రైమ్, చిన్నపిల్లలు, మహిళల పట్ల జరిగే నేరాలపై వారికి అవగాహన కల్పించారు. విద్యార్థులకు పోలీసుశాఖ తరపున పుస్తకాలు, పెన్నులను పంపిణీ చేశారు.

ఇండోనేషియా వర్సిటీతో ఎంవోయూకు ఎస్వీయూ అంగీకారం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): ఇండోనేషియా యూనివర్సిటీతో అవగాహన ఒప్పందానికి ఎస్వీ యూనివర్సిటీ అంగీకరించింది. ఇందుకు సంబంధించి వర్సిటీల ప్రతినిధులు ఆదివారం సమావేశమయ్యారు. ఇండోనేషియాలో గల బాండూంగ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీకి చెందిన డాక్టర్ మిత్ర డీ జమల్ తదితరులు ఎస్వీయూ వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడితో సమావేశమయ్యారు. ఎంవోయూపై చర్చించారు. బోధన, పరిశోధన అంశాల్లో పరస్పర సహకారానికి నిర్ణయించారు. ఎస్వీయూ ప్రతినిధుల బృందం ఇండోనేషియాలో పర్యటించనుంది. జూలైలో అధికారికంగా ఒప్పంద పత్రాలపై సంతకాలు చేయనున్నారు.

పుత్తూరు వార్తలు

భాష్యకారుల గ్రామోత్సవం

నారాయణవనం, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): పట్టణంలో కొలువై ఉన్న పద్మావతి సమేత కల్యాణ వెంకన్న ఆలయంలో భాష్యకారుల ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఆదివారం ఉత్సవాల్లో భాగంగా ఉదయం నిత్య పూజా కైంకర్యాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం భాష్యకారులు తిరుచ్చి వాహనంపై మాడవీధుల్లో విహరించారు. ఈ కార్యక్రమంలో ఆలయాధికారి నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

వారాహి అమ్మవారి ఆలయంలో అమావాస్య పూజలు



పుత్తూరు టౌన్, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని పరమేశ్వర మంగళం సమీపంలో ఉన్న దక్షిణ కాళిఅమ్మన్ వారాహి శక్తి పీఠంలో ఆదివారం అమావాస్య సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ఉదయం నిత్య పూజా కైంకర్యాలు, ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించి, విశేష పూజలు చేపట్టారు. అనంతరం శాంతి హోమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పుత్తూరు స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా ఆర్గనైజింగ్ కమిషనర్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆలయంలో సేవలందించారు. భక్తులకు అన్నదానం కార్యక్రమం నిర్వహించి, శీతల పానీయాలు అందించారు.

అంబేడ్కర్ యువజన సంఘ కార్యవర్గం

వడమాలపేట,ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ యువజన సంఘం వడమాలపేట శాఖ కార్యవర్గాన్ని ఆదివారు ఎన్నుకున్నారు. ఆదివారం సర్వసభ్య సమావేశంలో గౌరవ అధ్యక్షుడిగా లోకనాథం, అధ్యక్షుడిగా నాగరాజు, కార్యదర్శిగా మస్తాన్, కోశాధికారిగి గణేష్ సహా సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు సంఘం జిల్లా నాయకుడు డేవిడ్ తెలిపారు.

రేపు ఉడుపి పీఠాధిపతి రాక

పుత్తూరు టౌన్, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): గో సంరక్షణ కోసం పాదయాత్ర చేపడుతున్న ఆడమూరు మఠం(ఉడుపి) పీఠాధిపతి ఈషాప్రియ తీర్థ స్వామి మంగళవారం సాయంత్రం 7.30 గంటలకు పుత్తూరుకు విచ్చేయనున్నట్లు వీహెచ్‌పీ నాయకుడు కోటకొండ బాబు తెలిపారు. హైందవ ధర్మ పరిరక్షణలో భాగంగా గోసంరక్షణ కోసం ఆయన పాదయాత్ర చేపడుతున్నట్టు తెలిపారు. ఇందులో భాగంగా మంగళవారం సాయంత్రం 7.30 గంటలకు ఆర్‌డీఎం గేటు నుంచి పుత్తూరు శివాలయం వరకు పాదయాత్ర ఉంటుందని తెలిపారు.

భక్తులకు అన్నదానం

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పీవీరోడ్డులో కొవులై ఉన్న అంకాలమ్మ గుడి వద్ద ఆదివారం అమావాస్యను పురస్కరించుకుని ఆలయ నిర్వాహకులు అన్నదానం చేశారు. గోవర్ధన్‌రావు, యశ్వంత్‌రావు, జయగణేష్, రాజశేఖర్‌రావు, క్రాంతి కుమార్, అనూష, షర్మిల, కల్పన తదితరులు పాల్గొన్నారు.

పడిపోయిన చెరకు సాగు

- ప్రత్యామ్నాయ పంటలపై రైతు చూపు



అరిగిలకకండ్రిగలో చెరకు నరుకుతున్న కూలీలు

బుచ్చినాయుడుకండ్రిగ, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): మండలంలో చెరకు సాగు విస్తీర్ణం గణనీయంగా పడిపోయింది. గతంలో ప్రధాన పంటలతో పాటు చెరకు సాగు చేసే రైతులు ప్రస్తుతం ప్రత్యామ్నాయ పంటలపై ఆసక్తి కనబరుస్తున్నారు. మండలంలోని పదవమైలు దగ్గర మయూర షుగర్ ఫ్యాక్టరీ ఏర్పాటు తరువాత రైతులు వరికి దీటుగా చెరకు సాగు చేశారు. సుమారు 1800 ఎకరాల్లో చెరకు సాగయ్యేది. సదరు ఫ్యాక్టరీకి చెరుకు తోలగా రైతులకు సకాలంలో బిల్లులు చెల్లించలేదు. ఈక్రమంలో ఫ్యాక్టరీ మూతపడడంతో రైతులు ప్రత్యామ్నాయ పంటలపై ఆసక్తి కనబరుస్తున్నారు. ప్రస్తుతం కాటురూ, అరిగిలకండ్రిగ, కాంపాళెం, వీఎస్ పురంలో కేవలం 60 ఎకరాల్లో చెరకు సాగవుతోంది. ఈ చెరకును కూడా తమిళనాడు రాష్ట్రం పళ్లిపట్టులోని ఫ్యాక్టరీకి తరలిస్తున్నారు. వీరు కూడా ఈయేడాది ఇతర పంటలు సాగు చేసే అవకాశం ఉంది. రవాణా, చెరకు నరికే కూలీలే అధికం కావడమే ఇందుకు కారణంగా చెబుతున్నారు. ప్రస్తుతం నిమ్మ, వంగ, వరి, వేరుశనగను రైతులు సాగు చేస్తున్నారు.

దశాబ్దాల నిరీక్షణకు తెర

తుది దశకు పార్కు నిర్మాణ పనులు



ప్రజలకు అందుబాటులోకి రానున్న ఎన్టీఆర్ పార్కు

సత్యవేడు, ఏప్రిల్ 27: పట్టణ ప్రజలకు ఆహ్లాదం పంచేందుకు పార్కు అందుబాటులోకి రానుంది. ఎమ్మెల్యే ఆదిమూలం చొరవతో పంచాయతీ పరిధిలో నూతనంగా నిర్మిస్తున్న పార్కు నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయి. దీంతో స్థానిక ప్రజల దశాబ్దాల నిరీక్షణకు తెర పడనుంది. సత్యవేడులో 1979లో అప్పటి సర్పంచ్ మునిసుబ్రమణ్యం హయాంలో స్థానిక సత్యవేడు - ఊత్తుకోట మార్గంలో వాటర్ ట్యాంక్ కాలనీ సమీపంలో పట్టణ ప్రజల కోసం పార్కును నిర్మించారు. కొన్నేళ్ల వరకు ప్రజలకు ఆహ్లాదాన్ని అందించిన పార్కు అనంతర కాలంలో కనుమరుగైంది. పార్కు పక్కనే తెలుగు గంగ కాలువ నిర్మాణం జరగడంతో శిథిలమై పోయింది. అప్పటి నుంచి పట్టణంలో పార్కు నిర్మించాలన్న పంచాయతీ ప్రజల కోరిక కలగా మిగిలి పోయింది. ఎంతో మంది దాతలు ముందుకు వచ్చినా కార్యరూపం దాల్చలేక పోయింది. 2017లో అప్పటి ఎమ్మెల్యే ఆదిత్య చొరవతో సత్యవేడులో పార్కును పునర్నిర్మించేందుకు శ్రీకారం చుట్టారు. ఉపాధి హామీ నిధులను మంజూరు చేయించి పనులను మొదలు పెట్టారు. అయితే అప్పటికే 2019 సార్వత్రిక ఎన్నికలు సమీపించడం, వైసీపీ అధికారంలోకి రావడంతో పార్కు పనులు మధ్యలోనే ఆగిపోయాయి. పార్కును అందుబాటులోకి తీసుకురావాలన్న స్థానికుల అభ్యర్థన మేరకు స్పందించిన ప్రస్తుత ఎమ్మెల్యే ఆదిమూలం తుడా అధికారులను సంప్రదించి నిధులను మంజూరు చేయించారు. ఎమ్మెల్యే కృషితో తిరిగి పార్కు పనులు ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం పార్కు పనులు తుది దశకు చేరుకున్నాయి. ఇక్కడి పార్కుకు ఎన్టీఆర్ పార్కుగా నామకరణం చేశారు. త్వరలో సత్యవేడు ప్రజలకు పార్కు అందుబాటులోకి రానుంది

ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం

రాగి తీగల చోరీ



దుండగుల చేతిలో ధ్వంసమైన ట్రాన్స్‌ఫార్మర్

పిచ్చాటూరు, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంగళత్తూరులో శనివారం రాత్రి దొంగలు పొలాల్లో ఉన్న ట్రాన్స్ ఫార్మర్‌ను ధ్వంసం చేసి అందులోని రాగి తీగను చోరీ చేశారు. ఆదివారం ఉదయం నీరు పెట్టడానికి పొలాలకు వెళ్లిన రైతులకు ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసమై ఉండడం చూసి దాగ్భ్రాంతి చెందారు. వెంటనే ట్రాన్స్‌కో ఇంజనీర్ సుబ్రహ్మణ్యంరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఈ ట్రాన్స్‌ఫార్మర్ కింద ముగ్గురు రైతులకు చెందిన పొలాలున్నాయి. సంబంధిత అధికారులు సత్వరం స్పందించి ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేపట్టి అందుబాటులోకి తీసుకువస్తే తమ పంటలు ఎండిపోవని చెబుతున్నారు.

కోనోకార్పస్

మొక్కలను రక్షించండి

పర్యావరణవేత్త ప్రొఫెసర్ బయ్యపురెడ్డి

తిరుపతి(లీలామహల్), ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల్లో కోనోకార్పస్ మొక్కపై నిరాధార నిందలు ఆపి ఎన్నో ప్రయోజనాల గల మొక్కలను రక్షించాలని పర్యావరణవేత్త, ఆచార్య నాగార్జున యూనివర్సిటీ పూర్వ వృక్షశాస్త్ర ప్రొఫెసర్ కె.బయ్యపురెడ్డి కోరారు. జనచైతన్య వేదిక ఆధ్వర్యంలో ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో జరిగిన ముఖాముఖి కార్యక్రమానికి జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వి.లక్ష్మణరెడ్డి, ప్రముఖ ఆడిటర్ ఫల్గుణ కుమార్, ఎస్వీయూ జియాలజీ ప్రొఫెసర్ టి.వి.కృష్ణారెడ్డి, ఆల్ ఇండియా నేషనల్ బీసీ ఫ్రంట్ కన్వీనర్ కెఎం.ఎల్. నరసింహులు హాజరయ్యారు. బయ్యపురెడ్డి మాట్లాడుతూ కోనో కార్పస్ మొక్కలు మొదట యమన్‌లో సహజసిద్ధంగా పెరిగి క్రమేణా ప్రపంచవ్యాప్తంగా విస్తరించాయన్నారు. దుబాయ్, కువైట్, అబూదబి వంటి గల్ఫ్ దేశాల్లో నీరు లభించకపోయినా 70 శాతానికి పైగా పచ్చదనాన్ని అందిస్తున్నాయన్నారు. ఈ మొక్కలు కార్బన్ డై ఆక్సైడ్‌ను అత్యధికంగా తీసుకుని అత్యధిక ఆక్సిజన్‌ను అందిస్తాయని తెలిపారు. ఇవి అన్ని రకాల నేలల్లో పెరుగుతాయని, భూమిని కాపాడడమేకాక, వాయు, ధ్వని కాలుష్యం నుంచి ప్రజలను రక్షిస్తాయని వివరించారు. నిర్వహణ వ్యయం అవసరం లేదన్నారు. విదేశీ మొక్క అనే విమర్శను ఖండిస్తున్నానని, టమోటా, ఆలుగడ్డలు, మిర్చి, కాఫీ, టీ, మిర్చి లాంటివి కూడా విదేశీ మొక్కలేనని గుర్తు చేశారు. అలర్జీ, ఆస్మాలాంటి సమస్యలు వ్యక్తిగతమైనవని తెలుపుతూ బెంగళూరులోని అంతర్జాతీయ విద్యా సంస్థలు వేలాది కోనోకార్పస్ మొక్కలతో నిండి ఉన్నాయని, ఏ ఒక్క విద్యార్థికీ అలర్జీ సమస్య రాలేదన్నారు. ప్రపంచంలో సగటున ఒక్కొక్క మనిషికి 422 చెట్లు ఉండగా భారతదేశంలో కేవలం 28 మాత్రమే ఉన్నాయని వివరించారు.

వృథాగా తాగునీరు



రోడ్డుపై పారుతున్న కొళాయి నీరు

రేణిగుంట, ఏప్రిల్ 27, (ఆంధ్రజ్యోతి): వేసవిలో మండలంలోని కొన్ని పంచాయతీల్లో వారానికి ఒక రోజు తాగునీరు అందిస్తున్న పరిస్థితి. అయితే వారాలు తరబడి వీధి కొళాయి నుంచి వృథాగా తాగునీరు కింద పోతున్నా పట్టించుకునే నాథుడే లేడు. వివరాల్లోకి వెళితే... తుకివాకం పంచాయతీ పరిధిలోని గువ్వలకాలనీ వద్ద ఇటీవల రైల్వే ట్రాక్ నిర్మాణానికి ఆ ప్రాంతంలోని ఇళ్లను తొలగించి పనులు ప్రారంభించారు. కూల్చి వేత సందర్భంగా అదే ప్రాంతంలో ఉన్న పంచాయతీ కొళాయి ధ్వంసమైంది. చాలా రోజులుగా నీరు వృథాగా పోతోంది. దీనిపై చుట్టుపక్కల వాళ్లు సంబంధిత పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్టు చెబుతున్నారు. అయినా వారు పట్టించుకోలేదంటున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి వీధి కొళాయిని బాగు చేసి వృథాగా పోతున్న తాగునీటిని అరికట్టాల్సి ఉంది.

తిరుమలలో తప్పిపోయిన బాలుడు

మల్లవరంలో గుర్తింపు



రేణిగుంట, ఏప్రిల్ 27, (ఆంధ్రజ్యోతి): తిరుమలలో తప్పిపోయిన బాలుడిని మల్లవరంలో స్థానికులు గుర్తించి అర్బన్ పోలీసులకు ఆదివారం అప్పజెప్పారు. కర్ణాటక రాష్ట్రం రాయచూరు జిల్లా లింగసుగురు తాలుకా ముద్గల్ గ్రామానికి చెందిన బాలుడు శ్రీనివాస్ కుటుంబ సభ్యులతో కలిసి తిరుమల శ్రీవారి దర్శనార్థం వచ్చాడు. అక్కడ తప్పిపోవడంతో తిరుమల టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో బాలుడి తండ్రి కిష్టప్ప ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదైంది. ఆ బాలుడు మల్లవరంలో సంచరిస్తుండగా స్థానికులు వివరాలు అడిగి తెలుసుకున్నారు. వెంటనే అర్బన్ పోలీసులకు సమాచారం అందించారు. వారు తిరుమల టూ టౌన్ పోలీసులకు సమాచారం చేరవేశారు. ఈక్రమంలో తిరుమల పోలీసులు కిష్టప్పకు సమాచారం అందించారు.

అదనపు బస్టాండ్ నిర్మించండి

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల సౌకర్యార్థం శ్రీకాళహస్తి పట్టణంలోని ఏపీ సీడ్స్ కూడలి వద్ద అదనపు ఆర్టీసీ బస్టాండ్ నిర్మించాలని ప్రయాణికుల సంఘం అధ్యక్షుడు అన్నంబొట్ల మోహన్‌కృష్ణ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆదివారం శ్రీకాళహస్తి ఆర్టీసీ డిపో మేనేజరు మునిచంద్రయ్యకు వినతిపత్రం సమర్పించారు. ఇందులో భాగంగా ముక్కంటి ఆలయానికి తెలుగు రాష్ట్రాలతో పాటు దేశ నలుమూలల నుంచి పెద్దఎత్తున భక్తులు విచ్చేస్తుంటారని పేర్కొన్నారు. నెల్లూరు నుంచి శ్రీకాళహస్తికి విచ్చేసే భక్తులు గతంలో ఏపీసీడ్స్ కూడలి వద్ద దిగి ఆలయానికి చేరుకునేవారని తెలిపారు. ప్రస్తుతం కొత్త జాతీయ రహదారి నిర్మాణం పట్టణ శివార్లలోని ఊరందూరు నుంచి చెర్లోపల్లి మీదుగా తిరుపతికి సాగుతుందని వివరించారు. దీంతో బస్సులు ఏపీసీడ్స్ కూడలి వద్దకు చేరుకోకపోవడంతో నిత్యం ప్రయాణికులకు తీవ్ర అవస్థలు తప్పడంలేదన్నారు. ఏపీ సీడ్స్ కూడలి వద్ద కొంత భూసేకరణ చేసి ఆలయ నిధులతో అదనపు బస్టాండు నిర్మించడం ద్వారా శాశ్వత పరిష్కారం లభించడంతో పాటు ఆర్టీసీ, ముక్కంటి ఆలయానికి ఆదాయం పెరుగుతుందని పేర్కొన్నారు.

ఘనంగా అమావాస్య ఉత్సవం



శ్రీకాళహస్తి, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆదివారం అమావాస్య ఉత్సవం నేత్రపర్వంగా జరిగింది. జ్ఞానప్రసూనాంబ సమేత ముక్కంటీశుడి ఉత్సవమూర్తులకు ఆలయంలోని అలంకార మండపంలో విశేషంగా అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అలంకరించి ధూప,దీప, నైవేద్యాలను సమర్పించారు. మేళతాళాలు, మంగళవాయిద్యాలు, వేదమంత్రాల నడుమ స్వామిఅమ్మవార్లు పురవీధుల్లో ఊరేగారు. భక్తులు కర్పూర హారతులు సమర్పించారు.

కూలర్ల వితరణ



హెల్పింగ్‌హ్యాండ్స్ సిబ్బందికి కూలర్లు అందజేస్తున్న కొట్టేసాయి

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని హెల్పింగ్‌హ్యాండ్స్‌లో పని చేస్తున్న సభ్యులు, సిబ్బందికి జనసేన జిల్లా కార్యదర్శి కొట్టే సాయి కూలర్లను వితరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... దాదాపు పది సంవత్సరాలుగా హెల్పింగ్ హ్యాండ్స్ అధినేత మునీర్‌బాషా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని ఆ సంస్థలో పనిచేసే సిబ్బందికి వేసవి తాపం తట్టుకునేందుకు కూలర్లను అందించామన్నారు. మునీర్‌బాషా, జనసేన నాయకులు కుమార్, చిరంజీవి, సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

స్కౌట్ అండ్ గైడ్స్ శిక్షణ



శిక్షణలో పాల్గొన్న విద్యార్థినులు

కేవీబీపురం, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): మండలంలో స్థానిక ఆదర్శ పాఠశాల, కేజీబీవీలో 20 మండలాల విద్యార్థులకు స్కౌట్స్ అండ్ గైడ్స్ శిక్షణ కార్యక్రమం ఆదివారం రెండో రోజు కొనసాగింది. శిక్షణపై ఎక్కువ మంది బాలికలు మక్కువ చూపుతున్నారు. ఈ నెలాఖరు వరకు శిక్షణ తరగతులు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు.

కానిస్టేబుళ్లకు సన్మానం



కానిస్టేబుళ్లను సన్మానిస్తున్న ఎస్ఐ

బుచ్చినాయుడుకండ్రిగ, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పోలీసుస్టేషన్‌లో కానస్టేబుళ్లుగా పని చేస్తూ బదిలీ అయిన ప్రభాకర్, రేగన్, శరత్‌కుమార్, అరుణ్‌కుమార్, నమోరంగ, నరేష్‌ను ఎస్ఐ విశ్వనాథనాయుడు ఆదివారం శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ... ఐదుగురు కానిస్టేబుళ్లకు ఐదు సంవత్సరాలు పూర్తి కావడంతో ప్రభుత్వ నిబంధనల ప్రకారం బదిలీ అయ్యారని తెలిపారు.

వైద్య శిబిరానికి స్పందన



కేవీబీపురం, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం తిరుపతి రష్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో సుమారు 180మంది వైద్యపరీక్షలు చేయించుకున్నారు. వీరిలో 21మందిని ఆర్థో, యూరాలజిస్టులకు రెఫర్ చేసినట్లు రష్ ఆస్పత్రికి పీఆర్వో సుబ్రహ్మణ్యం తెలిపారు. వైద్యులు శివజ్యోతి, కిషోర్, రష్ ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.